Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 28.04.2017, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 47 పేజీలు : 12, వెల : ₹ 5





# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# నరేంద్రుడి నీడలో నారా చంద్రుడు



➡ మోడీ హవాతో గట్టెక్కొచ్చని ఆశ

➡ వన్ నేషన్ - వన్ ఎలక్షన్‌కు అందుకే మద్దతు

అదేం విచిత్రమోగాని... బీజేపీ వల్ల చాలా ప్రాంతీయపార్టీలు బలహీన పడ్డాయి. దాని మిత్రపక్షాలు కూడా బలయ్యాయి. ఇందుకు మహారాష్ట్రే ఉదాహరణ. ఒకప్పుడు ఈ రాష్ట్రంలో శివసేన పెద్ద పార్టీ. బీజేపీ అక్కడ మిత్రపక్షంగా ఉంటూనే ఇప్పుడు ఏకంగా రాష్ట్రాన్నే ఏలుతోంది. అస్సాంలో ఒకప్పుడు ఏజిపి మిత్రపక్షం. ఇప్పుడు అస్సాంనే బీజేపీ కబళించింది. ఇలా బీజేపీ మిత్రపక్షాలన్నీ ఆ పార్టీ దూకుడుకు బలహీనపడ్డమో, బలైపోవడమో జరుగుతుండగా, తెలుగుదేశం మాత్రం బీజేపీ వల్ల ఎప్పుడూ లాభపడుతూనే వుంది.

బీజేపీతో పొత్తు వల్ల ఒక ఎన్నికలో తెలుగుదేశం లబ్ది పొందుతుండగా మరుసటి ఎన్నికల్లోనే టీడీపీ పొత్తు వల్ల బీజేపీ మునిగిపోతూ వస్తోంది. 1999లో వాజ్‌పేయి ప్రభంజనం వల్లే తెలుగుదేశం అధికారంలోకి రాగా, 2004 ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం మీదున్న వ్యతిరేకత బీజేపీ మీద పడడం తెలిసిందే! మళ్ళీ 2014 ఎన్నికలలో బీజేపీ పొత్తు, నరేంద్ర మోడీ ఇమేజ్ తెలుగుదేశం అధికారంలోకి రావడానికి ఉపయోగపడింది. 2002లో గుజరాత్‌లో గోద్రా అల్లర్లు సంభవించినప్పుడు చంద్రబాబుకు రాక్షసుడు మాదిరిగా కనిపించిన నరేంద్ర మోడీనే ఇప్పుడు రాముడిగా కనిపిస్తున్నాడు. దేశమంతా మోడీ హవా పని చేస్తుందని చంద్రబాబు గ్రహించాడు. మొన్న ఉత్తరప్రదేశ్ ఎన్నికల ఫలితాలైతేనేమీ, నిన్న ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్ మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలైతేనేమీ మోడీ సమర్ధతపై చంద్రబాబు నమ్మకాన్ని మరింత పెంచాయి. మోడీ పేరుతో ఈసారి కూడా అధికారం దక్కుతుందనే ఆశ పెరిగింది. దాంతోనే మోడీ చేపట్టిన 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్' నినాదానికి చంద్రబాబు బలంగా మద్దతు పలికాడు. 2018లోనే దేశంలోని అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిపే దిశగా కేంద్రప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే మోడీ ప్రభంజనం ఉంటుందని, ఆ ఊపు రాష్ట్రంలో కూడా వస్తుందని చంద్రబాబు భావిస్తున్నాడు. ఒకేసారి ఎలక్షన్ పెడితే కేంద్రంలోని బీజేపీ శక్తియుక్తులన్నింటిని ప్రయోగిస్తుందని, బీజేపీతో పొత్తు పెట్టుకుంటే, ఆ ఊపు మీద తాను కూడా గట్టున పడొచ్చన్నది చంద్రబాబు ధీమా!

ఇంకోపక్కేమో కొందరు బీజేపీ నాయకులు వచ్చే (మిగతా 11వ పేజీలో)



# ఫేస్'బుక్'అయ్యారు!

» సోషల్ మీడియాపై దాడితో భ్రష్టుపట్టారు

» ఎల్లోమీడియాను చిత్తుచేస్తున్న సామాజిక మాధ్యమ ప్రచారం

తెలుగుదేశం ప్రభుత్వం అక్రమాలను అభివృద్ధి పథాలుగా చూపిస్తూ, అరాచకాలను ఆదర్శ మార్గాలుగా వల్లిస్తూ, అవినీతిని అంతులేని ప్రగతిగా అభివర్ణిస్తూ ఇంతకాలం ఎల్లో మీడియా ఏపి ప్రజల కళ్ళకు గంతలు కట్టాలని చూసింది. తాము చెప్పేవే సత్యాలు అన్నట్లుగా ప్రచారం చేసింది. అయితే ఎప్పటికప్పుడు నిజాలను బయట పెడుతూ, అక్రమాలను ప్రశ్నిస్తూ ఎల్లో మీడియాకు చుక్కలు చూపిస్తుంది సోషల్ మీడియానే!

అవును... రాష్ట్రంలో దాదాపు 90శాతం మీడియా సంస్థలన్నీ పచ్చ ప్రభుత్వం పట్ల పక్షపాతం చూపిస్తూ, ఈ రాష్ట్ర ప్రజలందరినీ ఒక భ్రమలోకి నెట్టే ప్రయత్నం చేసాయి. ఆ ప్రయత్నాలను చిత్తు చేస్తుంది సోషల్ మీడియా!

ఎల్లో మీడియాలో సంస్థల అధిపతులు కొందరే! కాని సోషల్ మీడియాలోకి వచ్చే సరికి టచ్‌స్క్రీన్ ఫోన్ వున్న ప్రతివ్యక్తి కూడా మీడియా ఓనరే! ఈ రాష్ట్ర ప్రజల ఆలోచనలను, ఆశలను, సమస్యలను ఏ మీడియా సంస్థా పట్టించుకోవడం లేదు. ఒకటి అరా మీడియా సంస్థలు పట్టించుకుంటున్నా వాటి మీద ప్రభుత్వ వ్యతిరేక ముద్రలున్నాయి. ఈ దశలో రాష్ట్ర (మిగతా 11వ పేజీలో)

# అయోమయంలో... ఆనం బ్రదర్స్



'ఎరక్కపోయి వచ్చాము... ఇరుక్కుపోయాము' అన్నట్లుగా ఉంది తెలుగుదేశంపార్టీలో ఆనం సోదరుల పరిస్థితి. కాంగ్రెస్‌లో వున్నప్పుడు హైమాక్స్ లైట్లు లాగా ధగధగ వెలిగారు. తెలుగుదేశంలోకి వచ్చాక కిరసనాయిల్ దీపాల్లా మారిపోయారు. కాంగ్రెస్‌పార్టీలో వున్నంత వైభవం ఇక్కడ రాదని తెలుసు... అయితే మరీ ఇంత అధ్వాన్నమవుతారనుకోలేదు.

రెండేళ్ల క్రితమే తెలుగుదేశంలో చేరిన ఆనం సోదరులు ఈ పార్టీలో ఎందుకు చేరామా అనే పరిస్థితుల్లో ఇప్పుడున్నారు. కాంగ్రెస్‌లో వున్న గౌరవం ఇక్కడ లేకపోగా, కనీసం ఇక్కడ వాళ్లను నాయకులుగా కూడా గుర్తించడం లేదు. పార్టీ కార్యక్రమాలకు సరిగా పిలవడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పతనం కావడం వారి రాజకీయ జీవితానికి శాపంగా మారింది. రాజకీయ పునరావాసం కోసమే వాళ్ళు తెలుగుదేశంలో చేరారు. ఆరోజుకు వాళ్లు వైసిపిలో చేరే పరిస్థితి లేదు. ఎందుకంటే కాంగ్రెస్‌లో వున్నప్పుడు జగన్‌ను వాళ్లు అట్లా ఇట్లా తిట్టలేదు. రాజకీయ విమర్శలు చేస్తే ఫర్వాలేదు. వీళ్ళు హద్దులు దాటి వ్యక్తిగతంగా కూడా విమర్శలు చేశారు. దానివల్లే వీళ్ళు వైకాపా వైపు చూసే పరిస్థితి లేకుండా పోయింది. అదీగాక తెలుగుదేశం అధికారంలో వుండడం, చంద్రబాబుతో పాత స్నేహం ఉండడంతో ఇక్కడైతే బాగుంటుందిలే అనుకుని తెలుగుదేశంలో చేరారు. అయితే చేరినప్పటి నుండి (మిగతా 11వ పేజీలో)



# పార్కులను అభివృద్ధి చేస్తాం



నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని అన్ని పార్కులను మూడు నెలల్లో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. ఆదివారం నెల్లూరులోని చిల్డ్రన్స్‌పార్కును కలెక్టర్ ముత్యాలరాజు, మేయర్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, కమిషనర్ ఢిల్లీరావుతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చిల్డ్రన్స్‌పార్కులో పిల్లలు, పెద్దలకు ఆహ్లాదంగా ఉండేందుకు అన్ని వసతులు ఉన్నాయని, అదేవిధంగా జిమ్‌ను సైతం ఏర్పాటు చేస్తామని తెలిపారు. సిఎం ఆదేశాల ప్రకారం అన్ని మున్సిపాలిటీల్లో డివైడర్లను హరితవనంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, టిడిపి నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్ళపాక రమేష్‌రెడ్డి, ఎస్ఇ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

# దాహార్తికి మూగజీవాలు విలవిల

తాగడానికి గుక్కెడు మంచినీరు దొరక్క జనం అల్లాడిపోతుంటే, దాహార్తికి మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. ఈ ఏడాది జిల్లాలో కరువు కరాళనృత్యం చేస్తోంది. వాగులు, వంకలు, చెరువులు, జలాశయాలు అడుగంటి ఎటుచూసినా ఎడారే కనిపిస్తోంది. దీంతో దాహంతో మూగజీవాలు గిలగిల కొట్టుకుంటూ వేలసంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. పశుగ్రాసం, నీటి కొరతవల్ల గడిచిన 45 రోజుల్లో 1255 పాడిపశువులు మృత్యువాత పడినట్లు సమాచారం. పూట గడవడమే కష్టమైన సమయంలో పశుపోషణ భారంగా మారిన రైతులు వాటిని తెగ నమ్ముకుంటున్నారు. పశుపోషణ భరించలేక ఇప్పటికే అత్యధిక శాతం పశువులను ఒక్కొక్కటిగా రైతులు కబేళాలకు తరలిస్తున్నారు. పాల దిగుబడి నిలిచిపోయిన పశువులను తక్కువ ధరలకు రైతులు అమ్మేస్తున్నారు. నీటి కొరతవల్ల పశువుల సంఖ్య తగ్గి పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. మార్చి నుంచి కరువు రక్కసి ప్రభావం తీవ్రరూపం దాల్చడంతో పశుపోషణ రైతులకు తీవ్రమైన భారంగా మారింది. దీంతో జిల్లాలో పాడిపశువులు గడ్డిపోచ కరువై నకనకలాడుతున్నాయి. పాడిపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న రైతు కుటుంబాల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.




# సబ్‌ప్లాన్ నిధులను వినియోగించాలి

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ క్రింద జిల్లాకు విడుదలైన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయాలని, అర్హతవున్న లబ్దిదారులకు త్వరితగతిన లబ్ది చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. 22వ తేదీ నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో దళితులకు భూమి కొనుగోలు పథకంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ గిరిజనుల, దళితుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, సబ్‌ప్లాన్ నిధుల వినియోగంలో లబ్దిదారుల ఎంపికలో జిల్లాను ప్రథమ స్థానంలో వుండేలా చూడాలన్నారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మెన్ జూపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ 2016–17 సంవత్సరానికి సంబంధించి రాష్ట్రం మొత్తం మీద దారిద్రరేఖకు దిగువనవున్న ఎస్సీలను సుమారుగా 91వేల 897మందిగా గుర్తించడం జరిగిందని, వారి అభివృద్ధే లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. యూత్‌వే యాప్ ద్వారా సుమారు లక్షా50వేల మందిని నమోదు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని 13జిల్లాలకు, జిల్లాకు 200కోట్ల మేర ఎస్సీ నిధులను విడుదల చేయడం జరుగుతుందన్నారు.


జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సేవాసంఘం వారు ముద్రించిన భూమి కొనుగోలు పథకం మరియు నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని ఆయన కోరారు. జిల్లాలో 22.5శాతం ఎస్సీలున్నారని భూమి కొనుగోలు విషయంలో లబ్దిదారులకు వార్షిక ఆదాయం, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, మార్కెట్ విలువ తదితర అంశాలను పరిశీలించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎ.ఎం.డి. ఇంతియాజ్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీమతి కృష్ణభారతి, ఆర్‌డిఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూరులో నేత్రపర్వంగా బ్రహ్మోత్సవాలు

- పేదప్రజల కోసం ఉచిత నేత్ర పరీక్షా కేంద్రం
- మంత్రి సోమిరెడ్డిచే ప్రారంభోత్సవం
- ప్రముఖ వదాన్యులు కలికి దంపతుల ఔదార్యం







నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరు గ్రామంలో వెలసివున్న శ్రీ షిర్డి సాయిబాబా, శ్రీ యోగాంజ నేయస్వామి వార్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ధర్మకర్తలు, ప్రముఖ వదాన్యులు శ్రీమతి కలికి శ్రీలత– శ్రీ కలికి కోదండ రామిరెడ్డిల నేతృత్వంలో ప్రజల సౌకర్యార్థం కొత్తూరులో ఉచిత నేత్రపరీక్షా కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ నెల 18 నుంచి 22వ తేది వరకు ఈ ఆలయాల్లో స్వామివార్ల బ్రహ్మోత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ నెల 19న శ్రీ సాయినాధునికి అత్యద్భుతంగా బ్రహ్మకలశాభిషేకం, ఆ తర్వాత 21న శ్రీ షిర్డిసాయినాధునికి, శ్రీరామ, శ్రీ ఆంజనేయస్వామికి, పరివార దేవతలకి నేత్రపర్వంగా రథోత్సవం నిర్వహించారు. 22వ తేదీన శ్రీ యోగాంజనేయస్వామివారికి ఎంతో భక్తిశ్రద్ధలతో శోభాయమానంగా బ్రహ్మకలశాభిషేక మహోత్సవం జరిగింది. కొత్తూరు నుంచే కాక, చుట్టుపక్కల అనేక గ్రామాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఈ బ్రహ్మోత్సవ వేడుకలను ఆసాంతం తిలకించి పులకించిపోయారు. ఇదే సందర్భంలో ఆలయ ధర్మకర్తలు తమ సామాజిక సేవలో భాగంగా..నేత్రసమస్యలతో బాధపడే ప్రజలకు ఎంతగానో ఉపయోగపడేవిధంగా ఉచిత నేత్ర పరీక్షా కేంద్రం ఏర్పాటుకు సంకల్పించారు. ఆ మేరకు నేత్రవైద్యంలో ప్రఖ్యాతమైన ఎల్విప్రసాద్ నేత్రవైద్య విజ్ఞానసంస్థ వారి సౌజన్యంతో కొత్తూరులో 'శ్రీ యర్రం రెడ్డి పరంధామరెడ్డి ఉచిత నేత్రపరీక్ష కేంద్రం'ను ఏర్పాటు చేసి ప్రజలందరి మన్ననలు అందుకున్నారు. స్వామివార్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 22న ఈ ఉచిత నేత్ర పరీక్షా కేంద్రానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఎంతో ఘనంగా జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కోవూరు శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో పాటు మరెంతో మంది ప్రముఖులు, స్థానిక ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు శ్రీమతి కలికి శ్రీలత, శ్రీ కలికి కోదండరామిరెడ్డిలు ఎంతో ఔదార్యంతో ప్రజల కోసం ఈ ఉచిత నేత్రపరీక్షా కేంద్రాన్ని ఏర్పాటుచేయడం పట్ల ప్రజలందరూ తమ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైనవారికి స్వర్ణభారత్ ట్రస్ట్‌లోనూ, వారి అవసరాన్ని బట్టి మరింత ప్రముఖమైన ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రుల్లోనూ ఉచితంగానే శస్త్ర పరీక్షలు కూడా చేయిస్తామని వైద్యకేంద్రం ప్రతినిధులు ఈ సందర్భంగా తెలియజేశారు. ఏదేమైనా, ఆధ్యాత్మిక సేవతో పాటు, సామాజిక సేవలోనూ తరిస్తూ.. ఇలాంటి ఎన్నో బృహత్తర సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఆలయ ధర్మకర్తల ఔదార్యాన్ని ప్రజలందరూ నిండు మనసుతో ప్రశంసిస్తున్నారు.

# పెంచలరెడ్డికి 'నుడా' బాధ్యత!



నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి(నుడా) వైస్‌ఛైర్మెన్‌గా రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ ప్రత్యేకాధికారి(ఓయస్‌డి) చల్లా పెంచలరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నుడా ఏర్పాటు ప్రక్రియ మరింత వేగవంతం కావడంతో పాటు త్వరలోనే ఛైర్మెన్ నియామకాన్ని కూడా చేపట్టేందుకు ప్రభుత్వం అవసరమైన కసరత్తును ప్రారంభించింది. గత మూడేళ్ళుగా జిల్లాను ఊరిస్తున్న నుడా ఏర్పాటు ఓ కొలిక్కి



నుడా వైస్‌ఛైర్మెన్‌గా ఎన్నికైన పెంచలరెడ్డి అభినందిస్తున్న రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం

వచ్చినట్లైంది. ప్రభుత్వ స్పెషల్ కలెక్టర్ హోదాలో ఉన్న మంత్రి ఓయస్‌డి పెంచలరెడ్డిని వైస్‌ఛైర్మెన్‌గా నియమించింది. ఛైర్మెన్‌తో పాటు పాలకమండలి సభ్యులను నియమించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేసే పూర్తి బాధ్యతలను వైస్‌ఛైర్మెన్‌కి కట్టబెట్టింది. క్యాబినెట్ ర్యాంకు కలిగిన నుడా ఛైర్మెన్ పదవిని ఎలాగైనా సొంతం చేసుకోవాలని ఇప్పటికే పలువురు అధికార పార్టీ నేతలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడ్ని ప్రసన్నం చేసుకుంటున్నారు. ప్రధానంగా మాజీమంత్రి, నెల్లూరురూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఛైర్మెన్ పదవి కోసం తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. మహానాడులోగా ఈ నియామకం జరిగిపోతుందన్న విశ్వాసంతో ఛైర్మెన్‌గిరి ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆదాలతో పాటు ఈ రేస్‌లో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జడ్.శివప్రసాద్, దేశాయిశెట్టి హనుమంతరావు, తాళ్ళపాక అనూరాధలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

# హ్యాట్రిక్ కొట్టిన కోటంరెడ్డి



వరుసగా మూడవసారి తెలుగుదేశంపార్టీ నగర అధ్యక్షుడిగా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించాడు. నెల్లూరు నగరంలోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం జరిగిన నగరపార్టీ సంస్థాగత ఎన్నికల్లో కోటంరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి ప్రకటించగా నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆమోదించారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి అనుచరుడిగా పేరున్న శేషుయాదవ్‌ను కూడా రెండవసారి నగర ప్రధానకార్యదర్శిగా నియమిస్తూ పార్టీ నిర్ణయం తీసుకుంది. కోటంరెడ్డి 2012, 2014లోనూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో పార్టీ అధికారంలో లేని సమయంలోనూ కోటంరెడ్డి నెల్లూరు నగరంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు చేశారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో మరోసారి నగర అధ్యక్షుడిగా నియమించినందుకు టిడిపి నేతలు చంద్రబాబునాయుడు, లోకేష్‌బాబు, బాలకృష్ణలతో పాటు మంత్రులు నారాయణ, సోమిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాళ్ళపాక రమేష్ రెడ్డి, ధర్మవరపు సుబ్బారావు, ఆనం జయకుమార్‌రెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు, చాట్ల నరశింహారావు పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



వికలాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని యువజన సర్వీసుల శాఖ, సెట్నల్ సిఇఓ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. నెల్లూరురూరల్ నియోజకవర్గం పడారుపల్లిలోని ఆచార్య పి.సి.రెడ్డి సమాజ మందిరంలో మంగళవారం రాత్రి క్రాంతి మహిళా మండలి ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌ఎఫ్‌డిసి నేతృత్వంలో వికలాంగులకు ఉచితంగా మగ్గం వర్క్‌పై మూడు నెలల పాటు ఇచ్చిన శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ ముగింపు సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వికలాంగులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం వికలాంగులకు సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు పిట్టి ప్రసాద్, ఈశ్వరి దంపతులు రూ.5వేలు నగదు, వంద కేజీల బియ్యం వితరణ చేశారు. విఘ్నేశ్వర మెడికల్స్ అధినేత రాజారెడ్డి అన్నదానం చేశారు. స్వచ్ఛంధ సంస్థల అధ్యక్షులు ఇవియస్ నాయుడు, వొమ్మిన సుబ్రహ్మణ్యం, కుసుమకుమారి, స్వర్ణ గంగాధర్, ఆచార్య పి.సి.రెడ్డి భవన నిర్మాణ దాత జి.రాజగోపాల్‌రెడ్డి, వికలాంగుల సంఘం నాయకులు ఆవుల నాగేంద్ర, ఊరందురూ సురేంద్రబాబు, సత్యవాణి, జానకి తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణ పొందిన వికలాంగులకు రూ. 7వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ అయినట్లు క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు జి.వెంకటలక్ష్మి పేర్కొన్నారు.



## 'ప్రభా'తం

# నెత్తుటిగడ్డ... ఛత్తీష్‌ఘడ్

**చత్తీస్‌ఘడ్..మావోస్‌ఘడ్‌గా మారిపోయింది. మావోయిస్ట్‌లకు అది కంచుకోటగా తయారైంది. ఈ ప్రాంతంలో మావోయిస్టులందరినీ ఏరిపారేశామని పోలీసులు భావిస్తున్న సమయంలో, దాదాపు నాలుగు వందలమందిదాకా మావోయిస్టులు ఒక్కసారిగా విరుచుకుపడి సిఆర్‌పిఎఫ్‌కి చెందిన 25 మంది జవాన్లను పొట్టనబెట్టుకున్నారంటే మావోయిస్ట్‌లు ఇక్కడ ఎంతగా చెలరేగిపోతున్నారో విశదమవుతోంది. మావోయిస్ట్‌ల అకృత్యాలతో చత్తీస్‌ఘడ్ బీభత్సంగా మారుతోంది.**

చత్తీస్‌ఘడ్.. మావోస్‌ఘడ్‌గా మారిపోయింది. మావోయిస్ట్‌లకు అది కంచుకోటగా తయారైంది. ఎక్కడ మాటు వేసి వుంటారో తెలియదు..ఒక్కసారిగా రక్తపాతం సృష్టించడమే వారి పని. వందలాదిగా విరుచుకుపడి జవాన్లను..పోలీసులను నిర్దాక్షిణ్యంగా హతమార్చడమే లక్ష్యంగా పెట్టుకున్న రాక్షసమూక అది. అసలే దండకారణ్యం..మావోయిస్టుల రాక్షసక్రీడలకు నిలయంగా మారింది. విధి నిర్వహణకు ఎక్కడెక్కడినుంచో వచ్చి, తమ బాధ్యతలు నిర్వర్తిస్తున్న అమాయక జవాన్లు..పోలీసులు వారి టార్గెట్‌గా మారడం ఎంతైనా దారుణం. చత్తీస్‌ఘడ్ అటవీప్రాంతంలో మావోయిస్టులందరినీ ఏరిపారేశామని పోలీసులు భావిస్తున్న సమయంలో, దాదాపు నాలుగు వందలమందిదాకా మావోయిస్టులు ఒక్కసారిగా విరుచుకుపడి సిఆర్‌పిఎఫ్ (కేంద్ర రిజర్వ్ పోలీసుదళం)కి చెందిన 25మంది జవాన్లను పొట్టనబెట్టుకున్నారంటే ఈ ప్రాంతంలో మావోయిస్ట్‌లు ఎంతగా చెలరేగిపోతున్నారో విశదమవుతోంది. ఇంతమంది జవాన్లను సైతం లెక్కచేయకుండా వారిపై తుపాకులు ఎక్కుపెట్టారంటే మావోయిస్ట్‌లు ఎంతగా బరితెగించి పోతున్నారో అర్ధమవుతోంది. అంతమంది జవాన్లపై హటాత్తుగా దాడిచేసి మావోయిస్టులు తమ పైశాచికత్వాన్ని మరోసారి రుజువు చేసుకున్నారు. జవాన్లు తేరుకునేలోపే దుండగులు ఏకధాటిగా గుళ్ళ వర్షం కురిపించారు. జవాన్లు కొందరు మావోయిస్ట్‌లపై ఎదురుదాడి చేసేలోగానే.. అనేకమంది జవాన్లు నేలకొరిగిపోయారు. మాటువేసి..జవాన్లపై దొంగదెబ్బ తీసిన మావోయిస్ట్‌లు జవాన్ల మృతదేహాల వద్ద వున్న ఆయుధాలను కూడా ఎత్తుకుపోయారు. ఈ అమానుష దాడిలో సిఆర్‌పిఎఫ్ జవాన్ల బృందానికి కమాండర్‌గా వున్న రఘువీర్‌సింగ్ కూడా ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరం. ఈ ఘటనలో ఏడు గురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన అనేకమంది జవాన్ల పరిస్థితి విషమంగానే వుంది. మరో 8 మంది జవాన్ల ఆచూకీ కూడా దొరకడం లేదు. గత ఏడాది అక్టోబర్‌లో మల్కాన్‌గిరి జిల్లాలో ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో (ఏఓబి) జరిగిన భారీఎన్‌కౌంటర్లకు ప్రతీకారంగా మావోయిస్టులు ఈ ప్రతీకార దాడికి పాల్పడివుండవచ్చని పోలీసువర్గాలు భావిస్తున్నాయి. ఆ ప్రాంతంలో రోడ్డు పనులకు రక్షణగా వున్న జవాన్లందరినీ వందలాదిమంది మావోయిస్ట్‌లు ఒక్కసారిగా చుట్టుముట్టి కాల్పులకు తెగబడడమే కాక, దారిపొడుగునా మందుపాతర్లు పేల్చి ఆ ప్రాంతమంతా బీభత్సం సృష్టించారు. సిఆర్‌పిఎఫ్ 74వ బెటాలియన్‌కు చెందిన 150 మంది జవాన్లు దక్షిణ బస్తర్‌లోని కాలాపత్తర్ ప్రాంతంలో నిర్మాణంలో వున్న రహదారి వద్ద గస్తీగా వుండి.. భద్రతావిధులు నిర్వర్తించి వస్తుండగా, ముందుగానే వ్యూహం పన్నిన మావోయిస్టులు ఆ రహదారి వద్ద పొంచివుండి.. ఒక్కసారిగా జవాన్లపై తుపాకులు ఎక్కుపెట్టి విచక్షణా రహితంగా కాల్పులు జరిపి రక్తపాతం సృష్టించారు. పోలీసులు, ఇంటెలిజన్స్ వర్గాలు అప్రమత్తంగా లేకపోవడం వల్లనే ఇంత దారుణం జరిగివుంటుందని సర్వత్రా భావిస్తున్నారు. చత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టుల బలాన్ని సక్రమంగా అంచనా వేయలేకపోవడం, నిఘావర్గాలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వుండకపోవడం వంటి వైఫల్యాలు కొట్టవచ్చినట్లు కనిపిస్తూనే వున్నాయి. చింతగుహ నుంచి బురకాపాల్ వరకు వున్న ఆ రహదారి నిర్మాణానికి నక్సలైట్లు ఆటంకం కలిగిస్తారేమోనని భావించి కేంద్రం పెద్దఎత్తున పోలీసు బలగాలను అక్కడికి పంపినప్పుడు, ఆ ప్రాంతంలో జవాన్లకు రక్షణగా పటిష్టమైన నిఘా వ్యవస్థ లేకపోవడం లోపమేననుకోవచ్చు. పోలీసులు అప్రమత్తంగా లేకపోవడం, వందలాదిమంది మావోయిస్ట్‌లు తరలివచ్చి ఇంత భయంకరమైన విధ్వంసం సృష్టిస్తున్నా...కనీస సమాచారం లేక..ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకునే అవకాశం కూడా లేకపోవడం...వంటివన్నీ నిఘావర్గాలు లేదా పోలీసువర్గాల వైఫల్యమేనని భావించవచ్చు. నక్సల్స్ బలం తగ్గిపోయిందనుకున్న పోలీసుల అతివిశ్వాసమే ఇప్పుడు కొంపముంచింది. ప్రతీకారం కోసం కాచుకునివున్న మావోయిస్ట్‌లు ఇదే అదనుగా ఈ మారణకాండకు తెగబడినట్లు స్పష్టమవుతోంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి నిధులతో కేంద్రప్రభుత్వం ఇక్కడ రహదారులు నిర్మిస్తుంటే సహించలేక మావోయిస్టులు ఇలాంటి పైశాచికదాడులకు పాల్పడడం.. అమాయక జవాన్లను సైతం పొట్టనపెట్టుకోవడం దారుణం. రక్షణగా వచ్చినవారికే రక్షణ లేకపోవడం బాధాకరం. ఇలాంటి ఘటనలపై, మావోయిస్టుల అకృత్యాలపై కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కఠినచర్యలు తీసుకోవాల్సి వుంది. ఇప్పుడే కాదు..గతంలో కూడా మావోయిస్ట్‌లు ఇలాంటి బీభత్సాలకు పాల్పడివున్నారు.

అయినా ఈ దారుణాలు..హింసాత్మక ఘటనలు ఇంకా ఎంతకాలం?...నేటి ఆధునికయుగంలో అత్యంత అద్భుతమైన సాంకేతిక విజ్ఞానంతో ప్రపంచమంతా వూహించనంత వేగంతో ప్రగతిదారుల్లో పయనిస్తుంటే, కమ్యూనిస్టుదేశాల్లో సైతం ఆర్థిక సంస్కరణలు వెల్లువెత్తుతూ పెట్టుబడిదారీ సంస్కృతి సర్వత్రా వెల్లివిరుస్తుంటే.. ప్రగతిలో అమెరికాతో సైతం కమ్యూనిస్ట్ చైనా పోటీపడి ముందుకు సాగుతుంటే... మావోయిస్ట్‌లు ఇంకా పిడివాదంతో అడవుల్లో ఆయుధాలు పట్టుకుని తిరుగుతుండడం... ఇలాంటి దారుణ మారణకాండలకు, హింసాత్మకచర్యలకు పాల్పడుతుండడం ఏమిటో.. చివరికి వారు సాధించగలిగేదేమిటో.. వారికే తెలియాలి.

ఎవరైనా సరే, హింసతో సాధించగలిగేదేమీ వుండదన్న వాస్తవాన్ని గుర్తించాలి. శాంతియుత విధానాలతో జీవిస్తూ.. సమస్యలేమైనా వుంటే చర్చించి వాటి శాశ్వత పరిష్కారానికి కృషిచేస్తూ, తద్వారా సమాజాభ్యున్నతికి పాటుపడాలే తప్ప..అన్ని సమస్యలకీ హింసే పరిష్కారమార్గం అనుకోవడం.. హింసాత్మక మార్గాలను అనుసరించడం మూర్ఖత్వమే. అందులోనూ ప్రజలకు రక్షణగా నిలిచే జవాన్లు, పోలీసులపై ఇలాంటి హింసాకాండలకు పాల్పడడం.. బీభత్సాలు.. రక్తపాతాలు సృష్టించడం పైశాచికత్వమే తప్ప మరొకటి కాదు. అది ఏనాటికీ మానవత్వమనిపించుకోదు.

## నేత్రపర్వంగా శ్రీ సత్యసాయి ఆరాధన

భగవాన్ శ్రీ సత్యసాయిబాబా ఆరవ ఆరాధనోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న నెల్లూరు రామ్మూర్తినగర్‌లోని శ్రీ సత్యసాయి భజనమందిరంలో నేత్రపర్వంగా ఆరాధన పూజలు జరిగాయి. శ్రీ సత్యసాయి భజనమందిరంవారి పర్యవేక్షణలో, శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో భాగంగా ఎంతో భక్తిశ్రద్ధలతో 'మహా నారాయణసేవ' నిర్వహించారు. సత్యసాయి భక్తబృందం వారు సామూహిక భజనలు నిర్వహించగా, అదే రోజు రాత్రి టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్‌వారి సహకారంతో వీనులవిందుగా అన్నమయ్య సంకీర్తనల గానం జరిగింది. అనంతరం, శ్రీ సత్యసాయి సేవాసమితి కన్వీనర్ మన్నెం శ్రీనాధరెడ్డి ఆధ్వర్యంలో భక్తులందరికీ అన్నప్రసాదవితరణ గావించారు. ఆర్టీసి బస్‌స్టేషన్ వద్ద కూడా అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, సురేష్‌సింగ్, సునీల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం



కిడ్నీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వుండాలని, ప్రాధమిక దశలోనే కిడ్నీ సమస్యలను గుర్తించి తగు చికిత్స చేసుకోవాలని ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఎస్‌విఎల్ నారాయణ రావు సూచించారు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న జరిగిన కార్యక్రమంలో ఆయన కిడ్నీ వ్యాధులకు సంబంధించిన పలు అంశాలపై వాకర్స్‌కు అవగాహన కలిగించారు. వాకర్స్ సందేహాలను నివృత్తి చేశారు. వాకర్స్ అధ్యక్షుడు వినుకొండ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డాక్టర్ నారాయణరావును డాక్టర్ సత్యనాథ్ ఆధ్వర్యలో వాకర్స్ ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి జయరామనాయుడు, కోశాధికారి పిట్ల రాజారావు, సంయుక్త కార్యదర్శి సాయిసుబ్బారావు, ఎల్. శ్రీనివాసులు, ఏసీ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, వాకర్స్ ఇంటర్నేషనల్-203 డిప్యూటి గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, డాక్టర్ అంకిరెడ్డి, డాక్టర్ సత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.




## ఫేస్‌బుక్ అంటే భయమేల?

హైదరాబాద్‌లో ఐటి సంస్థలు నా పుణ్యమే, సత్య నాదెళ్లను మైక్రోసాఫ్ట్ సిఇఓను చేసింది నేనే... సుందర్‌పిచ్చాయ్ గూగుల్ సిఇఓ కావడానికి కారణం నేనే... అని అనునిత్యం పాటపాడే చంద్రబాబు నాయుడు మరి సోషల్‌మీడియా మీద ఎందుకు దాడిచేస్తున్నాడో అర్థం కావడం లేదు. సోషల్ మీడియాలో ఎవరి అభిప్రాయాలు వాళ్లు చెబుతుంటారు. ఎవరి పోస్టింగ్‌లు వాళ్లు పెడుతుంటారు. ఎలాగూ పచ్చమీడియా ఈ రాష్ట్ర ప్రజలు పడే బాధలను, సమస్యలను ప్రపంచానికి తెలియనివ్వడం లేదు. తెలుగుదేశం ప్రభుత్వ అవినీతి, అక్రమాలను చూసినా చూడనట్లు వదిలేస్తూ, కేవలం చంద్రబాబు భజనకే పరిమితం అవుతున్నారు. ఇప్పుడు ఏపి ప్రజలకు వాస్తవాలు తెలుస్తున్నది సోషల్ మీడియా ద్వారానే! మరి దీనికి భయపడితే చేస్తున్న తప్పులను ఒప్పుకున్నట్లేగా!

**- జి.నవీన్‌రెడ్డి, నెల్లూరు.**

## చెడపకురా చెడేవు!

నిజజీవితాలలో జరిగేవే సినిమాలుగా మారుతుంటాయి. అచ్చం శశికళది కూడా సినిమాస్టోరీనే! "అతిగా ఆశపడే మగాడు, అతిగా ఆవేశపడే ఆడది బాగుపడినట్లు చరిత్రలో లేదు' అన్న రజనీకాంత్ డైలాగ్ శశికళ విషయంలో నిజమైంది. ఆమె అతిగా ఆవేశపడడమే కాదు, అతిగా ఆశపడింది కూడా! జయలలిత అధికారాన్ని అడ్డం పెట్టుకుని వేలకోట్లు దోచిన ఆమెకు చివరకు జైలే గతయ్యింది. సీఎం సీటు ఎక్కించిన పళనిస్వామి కూడా ఇప్పుడు ఆమెకు అడ్డం తిరిగాడు. అర్హత లేకపోయినా సీఎం కుర్చీ ఎక్కాలని చేసిన ప్రయత్నానికి ఫలితమే ఇదంతా!

**పి.రూపా, చెన్నై.**

## బాహుబలి వెంకయ్య

రాజకీయ బాహుబలి వెంకయ్యనాయుడు. సవ్య సాచి, వాచస్పతి కూడా! వాగ్ధాటి, చొరవ ఆయనను అందలం ఎక్కించాయి. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాల సమస్యలపై అవగాహన కలిగి ఉన్నాడు. అన్ని భాషలు తెలిసినోడు. మోడీ తర్వాత కేంద్రంలో అనర్గళ ఉపన్యాసయోధుడు. నెల్లూరుజిల్లాలో ఎందరినో పేరుపెట్టి పిలవగలిగేంత చనువున్న నాయకుడు. నెల్లూరు జిల్లా అభివృద్ధికి ఎన్నో కొత్త స్కీంలు తీసుకు వస్తున్నాడు. వెంకయ్య ఇంకా ఎన్నో మంచి పనులు చేయాలని, ఆ వెంకయ్యస్వామి ఆశీస్సులు ఆయనకు ఉండాలని కోరుతున్నాను.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## ఎంత దుర్మార్గం

పాతికేళ్ల క్రితం నాటి బాబ్రీమసీదు కేసును మళ్ళీ తవ్వి తీసారు. సిబిఐ పేరుతో మళ్ళీ నాటకం ఆడించి బీజేపీ అగ్రనేత అద్వానీ మీద కేసు నమోదయ్యేలా చేశారు. ఇదంతా కూడా ప్రధాని నరేంద్రమోడీ ఆడిస్తున్న నాటకమే! అద్వానిని రాష్ట్రపతి కాకుండా అడ్డుకోవడం కోసమే ఉన్నఫళంగా సిబిఐ ద్వారా బాబ్రీ కేసును తెరమీదకు తెచ్చారు. అద్వానీ రాష్ట్రపతి అయితే తనకు రాజ్యాంగపరమైన ఇబ్బందులు తలెత్తుతాయని మోడీ భయపడుతున్నట్లున్నాడు. అందుకే అద్వానీకి ఈ విధంగా చెక్ పెట్టారు. దేశాన్ని అభివృద్ధి బాట పట్టిస్తున్నాడంటూ మోడీని పొగిడేస్తున్న నాయకులు ఈ విషయంలో ఆయన్ను మరి వేనకేసుకొస్తారో... ఇది న్యాయం కాదంటారో చూడాలి మరి!

**పి.వి.మధుసూదన్, నెల్లూరు.**



# రహదారిపై రక్తఘోష

మొన్న చిత్తూరుజిల్లా ఏర్పేడు పోలీస్‌స్టేషన్ వద్ద జరిగిన ఘోరం గురించి అందరికీ తెలిసిందే! అదుపు తప్పిన లారీ వల్ల 15మంది అక్కడికక్కడే చనిపోవడంతో పాటు 20మంది దాకా గాయపడ్డారు. అక్రమ ఇసుక దందాను అడ్డుకోవాలని కోరడానికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వాళ్లు ఈ విధంగా బలయ్యారు.

## రోడ్డు విస్తరించకపోతే రోజూ ప్రమాదాలే!

ఈ ప్రమాదానికి కారణాలలో ఇసుక మాఫియా, లారీ అదుపుతప్పడం, క్లీనర్ బండి నడపడం అనేవన్నీ ఒక కోణం. ఇంకో కోణం అత్యంత ట్రాఫిక్ రద్దీ వుండే ఈ రహదారిని నాలుగులైన్లుగా విస్తరించకపోవడం. ఏర్పేడు వంటి ఊరికి బైపాస్ లేకపోవడం. రెండో కోణంలో చూస్తే ఈ కారణాలు కూడా కని పిస్తాయి. నాయుడుపేట నుండి కర్నాటక సరిహద్దు ముల్‌బాగిల్ దాకా ఈ రహదారిని నాలుగులైన్ల రహదారిగా విస్తరించాలనే ప్రతిపాదన ఎప్పటి నుండో వుంది. దీనిని జాతీయ రహదారుల్లో కలిపారు కూడా! దేశంలోనే అత్యంత వేగంగా నాలుగులైన్లుగా విస్తరించాల్సిన అవసరమున్న రోడ్డు ఇది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమల తిరుపతికి వెళ్లడానికి ప్రధాన మార్గం ఇదే! దీంతోపాటు ఈ రహదారి అనుసంధానంగానే శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం వంటి పుణ్యక్షేత్రాలున్నాయి. ఏపిలోని 9 కోస్తా జిల్లాలతో పాటు ఒడిసా, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల నుండి కూడా వాహనాలలో తిరుపతి, బెంగుళూరులకు వెళ్లాలను కునే వారికి కూడా రోడ్డు మార్గమిదే! ఇక్కడే తిరుపతి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ వుంది. ప్రతిరోజూ పుణ్యక్షేత్రాలకు గాని, కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు గాని వేల సంఖ్యలో వాహనాలు ఈ రహదారిగుండానే పోతుంటాయి. ఎక్కువమంది విఐపిలు తిరిగే రహదారి కూడా ఇది.

ఇంత ట్రాఫిక్ ఉన్నా ఇంతవరకు ఈ రహదారిని విస్తరించే చర్యలు చేపట్టలేదు. ట్రాఫిక్ పెరగడం మూలంగా నాయుడుపేట, తిరుపతిల మధ్య రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఈ రోడ్డు మీద యాక్సిడెంట్ లేని రోజంటూ ఉండదు. ఈ రహదారిని నాలుగులైన్లు చేస్తే ఏర్పేడుకు కూడా బైపాస్ వచ్చుండేది. నిన్న జరిగిన దుర్ఘటనకు ఆస్కారముండేది కాదు. కనీసం జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకునైనా నాయుడుపేట, ముల్‌బాగిల్ మధ్య రహదారిని నాలుగులైన్లుగా విస్తరించడంపై ప్రజాప్రతినిధులు చొరవచూపాలి.



# పోలిట్‌బ్యూరోపై ఆశలు



తెలుగుదేశంపార్టీకి సంస్థాగతంగా కీలక విభాగం పోలిట్‌బ్యూరో. ఇందులో సభ్యుడిగా వుండడం ప్రతిష్టాత్మకంగా భావిస్తారు నాయకులు. పోలిట్‌బ్యూరో అంటే పార్టీ అధ్యక్షుడి తర్వాత నిర్ణయాలు తీసుకోవడంలో కీలక వ్యవస్థ. ప్రస్తుతం నెల్లూరుజిల్లా నుండి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పోలిట్‌బ్యూరో సభ్యులుగా వున్నారు. ఇప్పుడాయనను మంత్రి వర్గానికి తీసుకున్నారు. కాబట్టి పోలిట్‌బ్యూరోలో ఆయన స్థానాన్ని జిల్లా నుండి ఒకరిద్దరు నాయకులు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.

తెలుగుదేశం పార్టీలో చేరారనేగాని ఇంతవరకు ఆనం సోదరులను సంతుష్టపరిచే విధంగా పార్టీ అధిష్టానం నిర్ణయాలు లేవు. ఆనం రామ నారాయణరెడ్డికి ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించడం తప్పితే వాళ్లకు అదనంగా చేసిందేమీ లేదు. వాళ్లకు కాంగ్రెస్‌పార్టీలో ఉన్నప్పటి విలువలో కనీసం పదోవంతు విలువ కూడా తెలుగుదేశంలో లేకుండా పోయింది. కనీసం గల్లీ లీడర్లు కూడా వాళ్లను లెక్క చేయకుండా, ఈ పార్టీలో చేరి పొరపాటు చేసామనే పరిస్థితిని వాళ్లకు కల్పిస్తున్నారు. ఇటీవల స్థానిక సంస్థల కోటాలో గాని, గవర్నర్ కోటాలో గాని ఎమ్మెల్సీ సీటును ఆశించి భంగపడ్డారు. చంద్రబాబుపై పూర్తి అసంతృప్తితో వున్న ఆనం సోదరులకు పోలిట్‌బ్యూరోలో సభ్యత్వం దక్కే అవకాశముందని టాక్.

ఇంకోపక్క చూస్తే జిల్లాలో మంత్రి పదవులు, ఎమ్మెల్సీలు, నామినేటెడ్ పదవులన్నీ తూర్పు డెల్టా నాయకులకే దక్కుతున్నాయి. మెట్ట ప్రాంతం కేడర్‌ను, లీడర్లను పార్టీ చిన్నచూపు చూస్తుండడం వల్ల, ఎన్నికలప్పుడు ప్రజలు కూడా పార్టీని చిన్నచూపు చూస్తున్నారు. కనీసం పార్టీ పదవుల విషయంలోనైనా మెట్టప్రాంతం నాయకులను గుర్తించి, ఆ ప్రాంతం వారికి పోలిట్‌బ్యూరోలో స్థానం కల్పించాలని మెట్టప్రాంతం కార్యకర్తలు కోరుతు న్నారు. మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, రాపూరు, వెంకటగిరి ప్రాంతాలను తీసుకుంటే మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి సీనియర్ నాయకుడు. 1985 నుండి పార్టీని నమ్ముకుని ఉన్నాడు. ఇటీవల కాంగ్రెస్‌లోకి వెళ్లినా గోడకు కొట్టిన బంతిలా తిరిగొచ్చేసాడు. ఉదయగిరి నియోజకవర్గంలో ఆర్థికంగా శక్తివంతుడైన మేకపాటి సోదరులను మోటుకుంటూ పార్టీ కేడర్‌ను కాపాడుకొస్తున్నాడు. డబ్బులు చల్లనిదే నాయకుల వెనుక నలుగురు మనుషులు రాని నేటిరోజుల్లో కూడా కంభంకు రూపాయి ఖర్చు పెట్టకుండా వచ్చే మనుషులున్నారు. 1999లో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కూడా పని చేశారు. ఆయన ఆధ్వర్యంలోనే అప్పుడు జిల్లాలో తెలుగుదేశంపార్టీ మెజార్టీ సీట్లు గెలిచింది. మెట్ట ప్రాంతానికి చెందిన నాయకులను గుర్తిస్తే ఈ ప్రాంతంలో పార్టీ బలపడుతుందని ఈ ప్రాంతం కార్యకర్తల వాదన. మరి ఇది చంద్ర బాబు చెవికి చేరుతుందా, లేదా అరణ్యరోదనగానే మిగులుతుందో చూద్దాం!




పితృదేవోభవ

సంఘసేవకులు, ప్రజాసేవకులు

స్వర్గీయ తిక్కవరపు బాబురెడ్డి గారు

నిర్యాణం 4 మే 1992

25వ వర్ధంతి (04.05.17) సందర్భంగా

వారి పవిత్ర ఆత్మకు

శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ...

కుమారుడు

డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి

రాజ్యసభ సభ్యులు, మాజీ కేంద్రమంత్రివర్యులు

# ‘క్యాప్’లో ఐ.జి



కర్నూలు రేంజ్ ఐ.జి బి.వి.రమణకుమార్ 23వ తేదీ నెల్లూరు కొండాయపాలెం గేటు వద్దగల 'క్యాప్' ప్రాజెక్ట్‌ను సందర్శించారు. నెల్లూరుజిల్లా ఎస్పీగా వున్నప్పుడు ఆయన నారువేసి నీరు పెట్టిన ప్రాజెక్ట్ ఇది. 23వ తేదీ రియో డెంటల్ హాస్పిటల్ వారి సహకారంతో వినోద్ ఫౌండేషన్ వారు ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్యశిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అక్కడున్న చిన్నారులను ఎలా చదువుతున్నారని ప్రేమగా పలుకరించారు. అక్కడ పిల్లలు చూపిస్తున్న ప్రతిభను, చదువుల్లో వాళ్ల శ్రద్ధాశక్తులను చూసి ఆయన మురిసిపోయారు. విద్యార్థులకు ఆయనే స్వయంగా భోజనాలు వడ్డించారు. పెన్నులు, పెన్సిళ్ళు అందజేశారు. ఈ సందర్భంగా రియో డెంటల్ ఆసుపత్రి సిబ్బంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు బి.శరత్‌బాబు, ఏఆర్ ఏఎస్పీ వీరభద్రుడు, డిఎస్పీ జి.వి.రాముడు, వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శ్రీమతి టి.వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



ఈ మండు వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చడం ఎంతో అభినందనీయమని 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మైపాడుగేటు వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల దాహార్తిని తీర్చేందుకు పలు స్వచ్ఛంధసంస్థలు, వ్యక్తులు, కార్పొరేషన్ వంటి సంస్థలు నగరంలోని పలు కూడళ్ళ వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేస్తుండడం మంచి శుభ పరిణామమని అన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నాయకులు నారాయణరెడ్డి, మదన్, ముజీర్ తదితరులున్నారు.

# పెద్దాసుపత్రికే రోగం వచ్చింది...

పెద్దాసుపత్రికే రోగం వచ్చింది... చికిత్స ఎలా చేయాలో అర్ధంకాని పరిస్థితి. పెద్దాసుపత్రిలో పనిచేస్తున్న కొంతమంది డాక్టర్లు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులతో లాలూచిపడి పెద్దాసుపత్రికి వచ్చే రోగులను భయపెట్టి ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లాలని సిఫార్సు చేస్తున్నారు. ఇటీవల నెల్లూరు శివారు ఇరుకళలమ్మ గుడి ప్రాంతానికి చెందిన గీత ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చింది. వారు ఒక నెల ముందుగా పుట్టినా ఆరోగ్యంగా ఉన్నారు. అయితే పెద్దాసుపత్రి డాక్టర్ బిడ్డలకు నెమ్ము ఎక్కువగా వుందని, తాను పనిచేసే ఆసుపత్రికి తీసుకెళ్లాలని సిఫార్సు చేసింది. అలా ఆసుపత్రికి తరలించ లేదని రూ.6వేలు ఇంజక్షన్ వ్రాసారు. దీంతో బాధితులు ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావుకు ఫిర్యాదు చేశారు.

## ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లమనడం సిగ్గు చేటు - చాట్ల



పెద్దాసుపత్రిలో కొందరు డాక్టర్లు రోగులను భయపెట్టి ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లాలని చెప్పడం సిగ్గుచేటని పెద్దాసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరశింహరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 21వ తేదీ పెద్దాసుపత్రి పురిటి పిల్లల విభాగాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బాలింత బంధువులు తనకు ఫిర్యాదు చేసారని వైద్యం సక్రమంగా చేయమని అడిగితే తనపై, కలెక్టర్‌పై విమర్శలు గుప్పిస్తున్న డాక్టర్ల యూనియన్ నాయకులు దీనికి ఏమి సమాధానం చెప్తారని ప్రశ్నించారు. సూపరింటెండెంట్ చర్యలు చేపట్టాలని కోరారు.

# నెల్లూరు కబుర్లు

# జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా అమర్‌నాథ్

## సోమిరెడ్డికి కడప, నారాయణకు ప్రకాశం







నెల్లూరుజిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఆకే అమర్‌నాథ్‌రెడ్డిని నియమించారు. 2014లో పార్టీ అధికారంలోకి వచ్చాక ఇంతవరకు శిద్దా రాఘవరావు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా వ్యవహరించారు. అయితే రెడ్ల ప్రాబల్యం వుండే జిల్లాకు 'రెడ్డి' మంత్రయితేనే సెట్ అవుతుందనేమోనని అమర్‌నాథ్‌రెడ్డిని నెల్లూరు లోక్‌సభతో పాటు జిల్లాకు కూడా ఇన్‌ఛార్జ్‌గా నియమించారు.

ఇక మన జిల్లా మంత్రులైన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కడపజిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా నియమించారు. మొన్న కడప స్థానిక సంస్థల ఎన్నికల్లో సోమిరెడ్డి తన టాలెంట్ అంతా చూపించివున్నాడు. అందుకే ఇప్పుడు ఆయనకు కడపనే అప్పగించారు. మరో మంత్రి పి.నారాయణను ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా నియమించారు. ఇప్పటివరకు ఈయన చిత్తూరుజిల్లా ఇన్‌ఛార్జ్‌మంత్రిగా వ్యవహరిస్తూ వచ్చారు.

# రసాయనాలతో మగ్గపెడితే కఠిన చర్యలు




కాల్షియం కార్బైడ్‌తో పండ్లను మగ్గపెడితే కఠిన చర్యలు తప్పవని నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.ఎండి ఇంతియాజ్ పండ్ల వ్యాపారులను హెచ్చరించారు. ఈ నెల 21వ తేదీ ఆయన తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కాల్షియం కార్బైడ్‌తో పండ్లను మగ్గపెడితే ప్రజల ప్రాణానికి హాని కలుగుతుందన్నారు. మామిడి పండ్ల సీజన్‌లో కృత్రిమంగా రసాయనాలతో పండ్లను మగ్గపెట్టి విక్రయించడం నేరమన్నారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు పండ్ల దుకాణాలను తరచూగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఫుడ్‌సేఫ్టీ అధికారి జి.వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకపఠనంతో పరిపూర్ణ వికాసం



పుస్తక పఠనం వల్ల మనిషికి మంచి వికాసం కలుగుతుందని గుండాల లక్ష్మమ్మ-నరసయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఛైర్మెన్ గుండాల నరేంద్రబాబు అన్నారు. అంతర్జాతీయ పుస్తక పఠన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని దర్గామిట్టలో వున్న బాలసదన్ వసతి గృహంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రూజ్‌వెల్ట్ మహాశయుడన్నట్లుగా పుస్తకాలు లేని ఇల్లు..కిటికీలు లేని ఇల్లు వంటిదన్నారు. ఈ కార్యక్రమానికి ఎన్‌బికెఆర్ ఆర్ట్స్ సైన్స్ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఆచార్య టి. మాలకొండయ్య, బాలసదన్ మేట్రిన్ దుర్గాదేవితో పాటు బాలసదన్ బాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు నీతికథల పుస్తకాలను అందజేశారు.



## గోపికృష్ణకు
# బెస్ట్ అడ్మినిస్ట్రేటర్ అవార్డు

నార్త్ మిడిల్ అండమాన్ కలెక్టర్ అరవ గోపికృష్ణ భారతదేశ స్థాయిలో బెస్ట్ అడ్మినిస్ట్రేటర్ అవార్డును ఈ నెల 21వ తేదీన ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ నుంచి అందుకున్నారు. వరల్డ్ సివిల్ సర్వీస్ డే సందర్భంగా అవార్డులు అందజేశారు. నెల్లూరు, పొదలకూరురోడ్డు ప్రాంతానికి చెందిన గోపికృష్ణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించి మద్రాసులో ఐఐటి పూర్తి చేశారు. ఐఐటి తర్వాత ఐఎఎస్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం నార్త్‌మిడల్ అండమాన్ కలెక్టర్‌గా పని చేస్తున్నారు. గోపికృష్ణ నెల్లూరు, మాగుంట లేఅవుట్‌లోని ఎస్ఆర్‌కె స్కూల్ పూర్వవిద్యార్థి కావడం గమనార్హం.

## మూలస్థానేశ్వరుడి
# వసంతోత్సవాలు




నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 30వ తేదీ నుంచి మే నెల 8వ తేదీ వరకు వసంతోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వసంతోత్సవాల్లో భాగంగా 30న శంకర జయంతి అలంకారం, మే1న కిరాతార్జునీయం, 2న దత్తాత్రేయ, 3న హరిహర మూర్తి, 4న పార్వతీ పరిణయం, 5న త్రిపురాసుర, 6న బండాసురవధ, 7న మధుకైటభ వధ, 8న కైలాస సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# నెల్లూరులో పాత కలెక్టర్

ఒకప్పుడు నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా పనిచేసి ప్రస్తుతం రాష్ట్ర గనులశాఖ డైరెక్టర్‌గా వున్న బి.శ్రీధర్ 23వ తేదీ నెల్లూరొచ్చారు. జిల్లాలో ఆయా రీచ్‌లలో జరుగుతున్న ఇసుక రవాణా దందాపై ఆరా తీసారు. ఏర్పేడు ఘటనతో అప్రమత్తమైన ప్రభుత్వం ఇసుక మాఫియాలపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగానే శ్రీధర్ నెల్లూరొచ్చి ఇసుక మాఫియా వివరాలు సేకరించి వెళ్లారు.

# 30 నుండి జగద్గురు శ్రీ ఆదిశంకర జయంత్యుత్సవాలు



నెల్లూరు శ్రీ పినాకినీ విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ ఆదివారం నుండి మే నెల 4వ తేదీ గురువారం వరకు 71వ జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య జయంతి ఉత్సవాలు నెల్లూరు ట్రంకురోడ్డు శ్రీ తిప్పరాజు వెంకట సుబ్బయ్య కళ్యాణ సదనం(టివిఎస్ కళ్యాణసదన్)లో ఐదురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు పినాకినీ విద్యాపీఠం అధ్యక్షులు స్వయంపాకుల శ్రీనివాసులు, కార్యదర్శి దూబగుంట ప్రభాకరరావు, సహాయ కార్యదర్శి చక్రాల వెంకటలక్ష్మీనరసింహం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ, 1వ తేదీ రాజమండ్రికి చెందిన బ్రహ్మశ్రీ డా॥ చిర్రావూరి శివరామశర్మ ఉపన్యాసకులుగా శ్రీ శంకరుల వారి స్తోత్రవాఙ్మయము, అద్వైత విషయములు, తైత్తరీయోపనిషత్ భాష్యసారంపై ఉపన్యసిస్తారని, 2వ తేదీ, 3వ తేదీ రాజమండ్రికి చెందిన బ్రహ్మశ్రీ డా॥ ధూళిపాళ మహాదేవమణి ఉపన్యాసకులుగా శంకరులు - పరదేవతా ప్రతిష్ఠ తస్మైనమః కర్మణి విషయంపై ఉపన్యసిస్తారని, 4వ తేదీ విజయవాడకు చెందిన బ్రహ్మశ్రీ డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్ మనస్సాక్షి మహాభారతం - అద్వైత బోధ విషయంపై ఉపన్యసిస్తారని తెలిపారు. 30వ తేదీ ఆదివారం 5మందికి ఉచిత ఉపనయనాలు జరిపిస్తున్నట్లు తెలిపారు. 4వ తేదీ గురువారం ఉదయం 10గంటల నుండి వేదసభ మహాదాశీర్వచనము జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం శ్రీ మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అర్చనలు, వేదపారాయణం, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం ప్రదోషకాల పూజ, లలిత-విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ, లబ్ధప్రతిష్ఠులైన పండితులచే ఆధ్యాత్మికోపన్యాసం జరుగుతుందని తెలిపారు.

# ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ఆర్యవైశ్యుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యికోట్లతో ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటుచేయాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే డా పి. అనిల్‌కుమార్‌యాదవ్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ముక్కాల ద్వారకానాథ్ చేపట్టిన సాధనా దీక్షకు వారు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ, దేశంలో వ్యాపారపరంగా ఎక్కువగా పన్నులు చెల్లించేది ఒక్క ఆర్యవైశ్యులేనన్నారు. నగరంలో దాదాపు 20వేల కుటుంబాలకు పైగా ఆర్యవైశ్యులు పేదరికంలో వున్నారని, మధ్యతరగతిలో వుంటూ వ్యాపారపరంగా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ కష్టాలుతీర్చేందుకు వెయ్యికోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, సబ్సిడీ అవసరం లేదని, వడ్డీ లేని రుణాలు కాకుండా పావలా వడ్డీకి రుణాలు ఇచ్చి, తిరిగి చెల్లించేందుకు అవకాశం కల్పించడం ద్వారా పేద, మధ్యతరగతి ఆర్యవైశ్యులు వ్యాపారాలు చేసుకునేందుకు ఎంతో సహాయంగా వుంటుందని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల్లోనూ పేదలున్నారని, వారిని ఆదుకునేందుకు ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడమే ఉత్తమ మార్గమన్నారు. మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, సిపిఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, చంద్ర రాజగోపాల్ తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, దామవరపు రాజశేఖర్, నాయకులు వేలూరు మహేష్, కొణిదల సుధీర్, మునీర్‌సిద్దిక్, వి.శ్రీహరి రాయల్, గంధం సుధీర్‌బాబు, ఉప్పాల శేషుగౌడ్, జి.పి శ్రావణ్‌కుమార్, కాకు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మహిళ చదువే ఇంటికి వెలుగు

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం 9వ తరగతి చదువుతున్న ఆడపిల్లలకు బడికి వస్తా కార్యక్రమం క్రింద 75కోట్ల రూపాయల వ్యయంతో ఉచిత సైకిళ్లను పంపిణీ చేయడం జరుగుతుందని, తద్వారా ఆడిపిల్లల్లో ఆత్మస్థైర్యం పెంపొందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు.

22వ తేదీ ఆడ పిల్లలకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. మొదట విఆర్‌సి సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి సైకిల్ మీద ర్యాలీగా కస్తూర్బా కళాక్షేత్రం చేరుకున్నారు.



కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన సమావేశంలో మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఇప్పటికీ 10వ తరగతి పూర్తి కాగానే ఆడపిల్లలకు వివాహాలు జరిపించడం విచారకరమన్నారు. ఆడపిల్లలను 10వ తరగతి తరువాత కూడా చదువులను చదివించాలని ఆయన కోరారు. నేడు ఆడపిల్లలు చదువుల విషయంలో బాలుర కంటే అన్ని విషయాలలో ముందంజలో వున్నారన్నారు. గతంలో ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు కాలంలో గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యకు ఎంతో ప్రాధాన్యతనిచ్చారన్నారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ మహిళలు తమ కుటుం బాలలో వున్న వారందరి గురించి ఆలోచించేవారన్నారు. వారు తమ శ్రమతో వారి కుటుంబ సంక్షేమానికి ఎంతో దీక్షతో పని చేయడం చూస్తున్నామన్నారు.

జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు మాట్లాడుతూ 4కోట్ల రూపాయల వ్యయంతో జిల్లాలో 9,674 సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టినట్లు తెలియజేశారు. శాసనమండలి సభ్యులు నారాయణరెడ్డి మాట్లాడుతూ బడికివస్తా కార్యక్రమం ద్వారా 9వ తరగతి చదువుతున్న బాలికలకు ఉచితంగా సైకిళ్లను ఇవ్వడం సంతోషకరమన్నారు.

ఈ సమావేశంలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీమున్సిపల్ ఛైర్‌పర్సన్ టి.అనూరాధ, డిఇఓ మువ్వా రామలింగం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మంచినీటి కష్టాలు తీర్చండి

## - అధికారులకు మంత్రి నారాయణ ఆదేశం



ఈ వేసవిలో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో మంచినీటి సమస్యలు ఉత్పన్నమవుతాయని, ఎక్కడ ఆ సమస్య వున్నా వెంటనే అధికారులు స్పందించి ప్రజలకు మంచినీటి కష్టాలు తీర్చాలని రాష్ట్ర పురపాలక మంత్రి పి.నారాయణ జిల్లా అధికారులకు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులంతా సమన్వయంతో కలసి పనిచేయాలన్నారు. ఈ నెల 23న మంత్రి జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి సమావేశమై అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ మండు వేసవిలో త్రాగునీటి కల్పనకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలో ఎక్కడా త్రాగునీటికి సమస్య లేకుండా చూడాలన్నారు. అవసరమైతే ట్యాంకల ద్వారా మంచినీరు పంపిణీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా, పెండింగ్‌లో వున్న చెరువుల పనులు, చెక్‌డ్యామ్‌ల పనులను వెంటనే పూర్తిచేయాలని నీటిపారుదల శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులంతా కలసి పనిచేయాలన్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ, ఈసారి వర్షాలు లేకపోవడం వల్ల త్రాగునీటి సమస్య ఎక్కువగా వుండే అవకాశం వుందన్నారు. కనుక, ముందస్తు ప్రణాళికతో ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు. అదేవిధంగా, జాతీయ రహదారిలో కేటాయించిన విపిలి రోడ్లు గుంతలు పడివున్నాయని, వాటిని వెంటనే మరమ్మతులు చేయించాలని మంత్రి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు మాట్లాడుతూ, కనీసం నాలుగునెలలపాటు ప్రజలకు మంచినీటి కష్టాలు లేకుండా మునిసిపల్ అధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, వెంకటగిరి, కోవూరు, గూడూరు ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సునీల్‌కుమార్‌లతోపాటు నగర మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీ ఎమ్మెల్యేలు పరసా రత్నం, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, జెసి ఇంతియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# అట్టముక్కల్లో భగవద్రామానుజులు

## - అద్భుతమన్పించే ఓ భక్తుని సందేశాత్మక కళాత్మకత



కళాత్మకత వుండాలే గానీ ఎన్ని అద్భుతాలైనా సృష్టించవచ్చు. అందులో భక్తిపారవశ్యంతో వుండేవారికి కళాత్మక నైపుణ్యం వుంటే మరింత సందేశాత్మకమైన రీతిలో కళాత్మకతను ప్రదర్శించవచ్చుననేందుకు.. ఈ చిన్ని ఉదాహరణ చాలు. నెల్లూరు రంగనాయకులపేటకు చెందిన భగవద్భక్తుడు కిడాంబి నరసింహన్ కేవలం అట్టముక్కలతోనే అద్భుతాలు సృష్టించి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేస్తున్నాడు. శ్రీ భగవద్రామానుజుల వారి సహస్రాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని, ఆ స్వామిపై ఎనలేని భక్తితో ఆయన భగవద్రామానుజులవారి విగ్రహం నమూనాను అట్టముక్కలతోనే ఎంతో అద్భుతంగా రూపొందించాడు. మనం నిరుపయోగం అనుకుంటున్న అట్టముక్కలు కళాత్మకతను జోడిస్తే ఎలా అద్వితీయమైన రూపంగా రూపుదాల్చుతాయో... అదేవిధంగా సామాన్యభక్తుడు సైతం భక్తితత్వాన్ని అనుసరిస్తే ఆ భగవంతుని కరుణకు పాత్ర మవుతామని చాటడమే ఈ కళారూపం ఉద్దేశ్యమన్నారు. అదేవిధంగా, కలియుగ ప్రత్యక్షదైవమైన ఆ శ్రీవేంకటేశ్వరుని వజ్రకిరీటం నమూనాను కూడా ఆయన అద్వితీయంగా రూపొందించి భక్తాదులం దరికీ కనువిందు చేస్తున్నారు. ఏదేమైనా, భగవద్భక్తి–కళాత్మక నైపుణ్యం కలగలిస్తే ఎంతటి అద్భుతాలు సృష్టించవచ్చో నిరూపించిన కిడాంబి నరసింహన్ ఎంతైనా అభినందనీయుడు.

# విఎస్‌యూ అక్రమాలపై త్రిసభ్య కమిటి

నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో అవినీతి అక్రమాల నిర్ధారణకు రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమిస్తూ ఈ నెల 21వ తేదీ జీవో విడుదల చేసింది. నెలరోజుల్లో ఈ కమిటీ విచారించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనుంది. విఎస్‌యూలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై కథనాలు ప్రచురించడంతో విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వర్సిటీ కళాశాలకు వచ్చి నూతన భవనాలను సందర్శించి ఇక్కడి వాస్తవాలపై ఆరా తీశారు. వర్సిటీలో జరిగిన అవకతవకలపై, నూతన భవనాల నిర్మాణం తీరుపై త్రిసభ్య కమిటీని నియమించి నిజాలు నిగ్గు తేలుస్తామని ప్రకటించారు. ఆయన పర్యటన ముగిసిన కొద్దిరోజులకే కాకుటూరులోని నూతన భవనాల్లోకి వర్సిటీ కళాశాల, పరిపాలనా విభాగాలను తరలించారు. ఈ నేపథ్యంలోనే త్రిసభ్య కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ విడుదల చేసిన జివో ప్రకారం ఈ కమిటీలో రిటైర్డు ఐఏఎస్ సిబిఎస్ వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యామ్‌సుందరరెడ్డి, ఎస్‌వి యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఐవి రమణారెడ్డిలను నియమించారు.







# దేవాలయాల అభివృద్ధికి కృషి

**- మంత్రి మాణిక్యాలరావు**

రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ట్రస్టు సభ్యులు ప్రత్యేకచర్యలు తీసుకొని అభివృద్ధి చేస్తే భక్తులకు మరిన్ని సౌకర్యాలు ఏర్పడుతాయని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు అన్నారు. గూడూరు పట్టణంలోని రాజావీధి ప్రాంతంలో వున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో కనుమూరు హరిశ్చంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ దాతృత్వంతో కనుమూరు సత్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థంతో నిర్మించిన కార్యాలయం భవనం, అర్చకుల నివాస గృహాలను ఇటీవల గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, దేవాలయ ఛైర్మెన్ కనుమూరు హరిచంద్రారెడ్డి, పురపాలక అధ్యక్షురాలు పొనకా దేవసేన, పెంచలకోన దేవస్థాన ట్రస్టు ఛైర్మెన్ తానంకి నానాజీలతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయ కోనేరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాణిక్యాలరావు మాట్లాడుతూ ఆలయాల సభ్యులు ఆర్థిక వనరులను ఏర్పాటు చేసుకునేలా కృషి చేయాలని సూచించారు. మంత్రిని పలువురు నాయకులు సన్మానించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, చెంచురెడ్డి, ఆర్డీవో అరుణ్‌బాబు, తెలుగుదేశం నాయకులు పులిమి శ్రీనివాసులు, కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, దేవాలయ ఈవో శ్రీనివాసరావు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



దేవాలయ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మాణిక్యాలరావు, ఎమ్మెల్యే సునీల్, ఛైర్‌పర్సన్ దేవసేన



ఆర్డీవో అరుణ్‌బాబుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సునీల్, ఛైర్‌పర్సన్ దేవసేన తదితరులు

# అభివృద్ధికి తోడ్పాటునందించండి

**- ఎమ్మెల్యే సునీల్‌కుమార్**

గూడూరు నియోజకవర్గంలోని పలు మండలాల్లోని, పట్టణంలో నెలకొని వున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆర్డీవో అరుణ్‌బాబును కోరారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పలువురు కౌన్సిలర్లతో పాటు ఎమ్మెల్యే ఆర్డీవోను కలిసి పట్టణాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, తెలుగుదేశంపార్టీ గూడూరు అధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## గూడూరు డివిజన్ వార్తలు

# పేదలకు భూములివ్వండి

పేదలకు చెందాల్సిన ప్రభుత్వ బంజర, పోరంబోకు భూములు భూస్వాములు ఆక్రమణలో చేరాయని, అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ పోలయ్య అన్నారు. గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆ సంఘ నాయకులతో కలిసి సోమవారం ఆయన ధర్నా చేశారు. ఈ సందర్భంగా పోలయ్య మాట్లాడుతూ గూడూరు డివిజన్ సైదాపురం మండలంలోని తురిమెర్ల, జోగిపల్లి గ్రామంలో ఉన్న 300 ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమించినా సంబంధిత మండలంలోని రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని తెలిపారు. పేద ప్రజలకు చెందాల్సిన ప్రభుత్వ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఆయా గ్రామాలలోని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ సంఘ నాయకులు వెంకటయ్య, రమేష్, మస్తానయ్య, రమణయ్య, కృష్ణయ్య, హైమావతమ్మ, చిన్నమ్మ, పద్మలత తదితరులు పాల్గొన్నారు.




## అళఘనాథుని పల్లకి సేవ

గూడూరు పట్టణంలోని అళఘనాథస్వామి దేవాలయంలో శ్రీమద్రామానుజాచార్యులు తిరునక్షత్ర ఉత్సవంలో భాగంగా సోమవారం రాత్రి పల్లకిసేవను ఘనంగా నిర్వహించారు. ఉభయ దాతలుగా శ్రీనివాసులు, లక్ష్మీకుమారి వ్యవహరించారు. సంప్రదాయబద్ధంగా పూజలు చేపట్టారు.

# మంచి ఆరోగ్యానికి 'కమల్స్ లైఫ్‌స్టైల్'

**ఆరోగ్యం... మహాభాగ్యం**



**ప్రకృతివైద్యంతోపాటు.. అధునాతన చికిత్స**

**- డాక్టర్ కమల్**

*ఆరోగ్యం తరచూ బాగా వుండడం లేదని బాధపడుతుంటామే తప్ప, మంచి ఆరోగ్యం కోసం మనం ముందు జాగ్రత్తలు తీసుకోం. సమస్య జటిలమయ్యేదాకా తాత్సారం చేస్తూ, చివరికి ప్రాణంమీదికి వచ్చాక ఆసుపత్రులకు పరుగులు తీస్తుంటాం. ఇది చాలా మందిలో చాలా సహజమైన ధోరణి..ఇలాంటి వైఖరి వల్ల సమస్యలు తీరకపోగా మరింత పెరుగుతాయని, మంచి జీవనశైలితో వుంటే అనారోగ్యబాధలు వాటంతటవే దూరమవుతాయని ప్రముఖ వైద్యులు డాక్టర్ వెంకట కమలేంద్రబాబు అంటున్నారు.*

అంతేకాదు, ఎలాంటి మందులుమాకులతో పనిలేకుండా హాయిగా ప్రకృతి వైద్యవిధానం ద్వారా చేసే చికిత్స వల్ల రోగులకు ఎలాంటి దుష్ఫలితాలు లేకుండా ఎంతో మేలు కలుగుతుందని, ఈ అధునాతన చికిత్స వల్ల తాత్కాలిక ఉపశమనమే కాక, భవిష్యత్తులో కూడా ఎలాంటి అనారోగ్యబాధలు కలుగకుండా నివారించుకోవచ్చని చెప్తున్నారు. మంచి ఆరోగ్యానికి..కమల్స్ లైఫ్‌స్టైల్ ఎంతగానో ఉపకరిస్తుందని, ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలేమైనా వుంటే తమను సంప్రదించి పరిష్కరించుకోవచ్చని ఆయన సూచిస్తున్నారు.

దేశవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధమైన బెంగుళూరులోని జిందాల్ నేచర్ క్యూర్ ఇన్‌స్టిట్యూట్‌లో సీనియర్ ఫిజిషియన్‌గా దాదాపు అయిదేళ్ళ పాటు పనిచేసిన అనుభవంతో డాక్టర్ కమల్ నెల్లూరులో ఇటీవలఅధునాతనమైన రీతిలో 'లైఫ్‌స్టైల్ క్లినిక్'ను ఏర్పాటుచేశారు. మంచి జీవనశైలికి 'డ్రగ్ లెస్ థెరపీ'ని అందుబాటులోకి తెస్తున్న క్లినిక్ ఇది. నేచురోపతి, యోగా, సైకాలజీ తదితర అంశాల్లో అనుభవపూర్వకమైన పరిజ్ఞానంతో డాక్టర్ కమల్ ఈ క్లినిక్‌ను ఏర్పాటుచేశారు. 'డాక్టర్ కమల్స్ లైఫ్‌స్టైల్ క్లినిక్' పేరుతో నగరంలోని



టిడిపి కార్యాలయం సమీపంలోని శ్రీహరినగర్ ప్రెసిడియో టవర్స్ 2వ అంతస్తులో ఏర్పాటుచేసిన ఈ క్లినిక్‌లో ఆరోగ్యానికి సంబంధించి అనేక రకాల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆయన భరోసా ఇస్తున్నారు. ముఖ్యంగా, గ్యాస్ట్రిక్ ట్రబుల్, జీర్ణకోశ సంబంధిత వ్యాధులు, అధిక బరువుతో సమస్యలు..మోకాళ్ళనొప్పులు, మధుమేహంతో బాధలు.. తదితర జీవనశైలి ఆధారిత సమస్యలతో బాధపడేవారికి తమ క్లినిక్‌లో మంచి అధునాతనమైన చికిత్స వుంటుందని ఆయన తెలిపారు. ప్రకృతి వైద్యం పట్ల అందరూ అవగాహన పెంపొందించుకోవడం వల్ల, ప్రకృతి వైద్యవిధానాన్ని అనుసరించడం ద్వారా రోగులకు ఎంతో ఉపయోగంగా వుంటుందన్నారు. వ్యాధి వచ్చిన తర్వాత బాధపడేకంటే, వ్యాధికి కారణాలు తెలుసుకుని, వ్యాధిపట్ల అవగాహన కలిగించుకుని తద్వారా ఆ వ్యాధి నివారణకు ముందుజాగ్రత్తలు తీసుకోవడమే మంచిదని, ఎలాంటి మందులు లేకుండా వ్యాధులను నివారించేందుకు ఈ క్లినిక్ ఎంతగానో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. సాధారణంగా శరీరంలో అవసరం లేని పదార్థాలేమైనా వున్నప్పుడు అవి వ్యాధికారక మవుతాయని, అయితే ప్రకృతి సిద్ధంగా వేడి, నీరు, వాయువు వంటివి ఎన్నో రకాల సమస్యల నివారణకు దోహదం చేస్తాయని ఆయన అన్నారు. ఒక వ్యక్తి ఆరోగ్యాన్నే ప్రాతిపదికగా తీసుకోకుండా, ఆ కుటుంబంలోని వారందరి ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ, వారితో కలసి సంప్రదించడం ద్వారా, వారి ఆహారపు అలవాట్లు తెలుసుకుని, వారి జీవనశైలి క్రమబద్ధంగా వుండేలా తగు సూచనలు చేసేందుకు, అదేవిధంగా వారిని తరచూ బాధించే వ్యాధుల నిర్ధారణకు, నివారణకు తగు చికిత్స చేయవచ్చన్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ హెల్త్ వల్ల ఆ కుటుంబానికి దీర్ఘకాలిక ప్రయోజనం వుంటుందన్నారు. ఉదాహరణకు.. షుగర్ వ్యాధి (మధుమేహం)లో మనదేశం ప్రథమస్థానంలో వుందని, అయితే, మధుమేహ వ్యాధి నివారణకు ఎన్నో మార్గాలున్నాయని ఆయన అంటూ, తొలిదశలోనే (ప్రీ డయాబెటిక్) ఆ వ్యక్తి జీవనశైలి, ఆహారపు అలవాట్లు తెలుసుకోవడం ద్వారా వారికి అవసరమైన మార్పులు సూచించినప్పుడు మధుమేహాన్ని దూరంగా వుంచేందుకు అవకాశం కలుగుతుందన్నారు. అదేవిధంగా అవసరమైన యోగాసనాలు కూడా మధుమేహాన్ని అదుపులో పెట్టేందుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. షుగర్ వ్యాధి వచ్చాక దానిని అదుపులో పెట్టేందుకు ఎంతో కష్టపడాల్సి వుంటుందనీ, అలాకాక, ఈ వ్యాధి రాకుండా ముందుగానే అవగాహనతో వుంటే ఈ వ్యాధికి దూరంగా వుండవచ్చని అన్నారు. ఇకపోతే, సరైన సమయంలో నిద్ర లేకపోవడం, సక్రమంగా ఆహారం తీసుకోకపోవడం వంటివి అధిక బరువుకు కారణమవుతాయని, అయితే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇలాంటి సమస్యలన్నీ నివారించుకోవచ్చన్నారు. స్వల్ప ఖర్చుతోనే అధికబరువును నివారించుకోవడానికి తమ వద్ద మంచి చికిత్స అందుబాటులో వుందన్నారు. అంతేకాకుండా మెడనొప్పి, నడుము నొప్పులకు కూడా అవగాహనే సరైన ఔషధమని, ఆరోగ్య సమస్యల పట్ల ముందుగా అవగాహన పెంచుకుని, తగు చికిత్స తీసుకోగలిగితే ఇలాంటి సమస్యలన్నిటినీ దూరం చేసుకోవచ్చని అన్నారు. అందుకే ప్రత్యేకించి, ఇటీవల కొత్తగా ఈ 'లైఫ్ స్టైల్' క్లినిక్ ప్రారంభించామని, నెల్లూరు నగరంలో ఇలాంటి క్లినిక్ ప్రారంభం కావడం ఇదే తొలిసారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఆరోగ్య విషయాలన్నిటిపట్ల అవగాహన కలిగించేందుకు, ముఖ్యంగా వ్యాధుల బాధలతో సతమతమయ్యేవారికి, వారి కుటుంబసభ్యులకు కూడా సరైన అవగాహన కల్పించి..తద్వారా మంచి చికిత్సతో అందరికీ మంచి ఆరోగ్యాన్నిచ్చేందుకు..అనారోగ్య బాధలను నివారించేందుకు ఈ నూతన..అధునాతన విధానం ఎంతో ఉపయోగపడుతుందని డాక్టర్ కమల్ పేర్కొంటున్నారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 28.4.2017 నుండి
తేది. 04.5.2017 వరకు

ఈ వారం మేషంలో రవి బుధులు, వృషభంలో శుక్రుడు, వృషభ మిధున కర్కాటక రాశులలో చంద్రుడు, సింహంలో రాహువు, కన్యలో గురువు, ధనుస్సులో శని, కుంభంలో కేతువు, మీనంలో శక్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 30 ఆదివారము శంకర జయంతి
తేది 1 సోమవారము 'మేడే'(ప్రపంచ కార్మిక దినోత్సవం)
తేది 4 గురువారము డొల్లు కర్తరి.

**ముహూర్తములు**

తేది 4 గురువారము ఉదయం గంట 10.27 నుండి 12.33లోగా కర్కాటక లగ్నమున గృహారంభ వివాహ వ్యాపారములు.

**వైశాఖమాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 28 | శుక్ర | విదియ | ప॥ గం.1.32వ॥ |
| తేది. 29 | శని | తదియ | ప॥ గం.11.05వ॥ |
| తేది. 30 | ఆది | చతుర్థి | ఉ॥ గం.8.40వ॥ |
| తేది. 1 | సోమ | పంచమి | ఉ॥ గం.6.19వ॥ |
| | పిదప | షష్ఠి | రా॥ గం.4.05వ॥ |
| తేది. 2 | మంగళ | సప్తమి | రా॥ గం.2.06వ॥ |
| తేది. 3 | బుధ | అష్టమి | రా॥ గం.12.31వ॥ |
| తేది. 4 | గురు | నవమి | రా॥ గం.11.14వ॥ |

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థికంగా బాగుండినా స్థిమితంగా ఉండలేరు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగి ఆదాయం సామాన్యంగా ఉంటుంది. ఖర్చులు అధికం కాగలవు. వస్తు వాహన రిపేర్లు ఖర్చులు, బిడ్డల కుటుంబసభ్యుల అనారోగ్య బాధలుంటాయి. కుటుంబ విషయాలపై దృష్టి పెడతారు. బిడ్డల విద్యా వివాహ విషయాలలో ప్రయత్నాలు ముమ్మరం చేస్తారు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఇంటా బయట పనులందు శ్రమ ఉంటుంది. కాని చేపట్టిన పనులను సమర్ధవంతంగా నిర్వహిస్తారు. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. పబ్లిక్‌లో మంచి పేరుప్రతిష్టలు పొందుతారు. అదనపు ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహకరంగా సాగుతాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కొత్త పెట్టుబడులు, కొత్త వ్యాపారాల ప్రయత్నాలు జరుగుతాయి. ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. అయినా అవసరాలకు కొద్ది ఋణాలు చేయక తప్పదు. అనుకున్న పనులను శ్రమపడి సాధిస్తారు. విలువైన వస్తువులు సమకూరగలవు. శుభ కార్యాలు నిర్ణయం కావడం, బిడ్డల ఉన్నత విద్యపై శ్రద్ధ చూపడం జరుగుతుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

కొత్త వ్యాపారాలకు, సంస్థలలో పెట్టుబడులకు అవకాశములు దొరుకుతాయి. పట్టుదలతో అనుకున్న పనులు జరుపుకొంటారు. వ్యవహారాలలో సహచరులకు, మిత్రులకు మధ్య విభేదాలు రావచ్చు. ఖర్చులుండినా ఆర్థికంగా ఇబ్బంది పడరు. బాధ్యతలు, వ్యాపకాలు పెంచుకుంటారు. ఆరోగ్యం ఫరవాలేదు. శుభకార్యాలలో దైవకార్యాలలో పాల్గొంటారు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ముఖ్యవిషయాలపై నిర్ణయాలు తీసికొనలేక టెన్షన్ పడతారు. పెండింగ్ సమస్యలు పరిష్కారం కాగలవు. గృహ వస్తు వాహన రిపేర్ల ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలలో కొత్త అవకాశాలు లేకున్నా, ఆర్థికంగా బాగుండి ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాలలో పాల్గొంటారు. సాంకేతిక న్యాయ వైద్య రంగాల వారికి ఆర్థికావకాశాలు బాగుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగములలో గాని, ఇతర కార్యక్రమాలలో గాని నిర్వహణ సామర్థ్యం బాగుంటుంది. చేతి డబ్బులు ఇతరుల పనులకు గాను ఖర్చుపెట్టవలసి రావచ్చును. వృత్తి వ్యాపారాలు సామాన్య ఆదాయాన్నిస్తాయి. శుభ కార్యాలలో ఆత్మీయులను కలుస్తారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలిసివస్తాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఆరోగ్యం బాగుంటుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థిక ఇబ్బందులుండవచ్చును. ఖర్చులు అధికంగా ఉంటాయి. అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. వాహనాలు నడిపే వారు, మిషన్లు కరెంటు పనుల వారు జాగ్రత్తగా ఉండాలి. గృహ మార్పులు, స్థానమార్పులుండగలవు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. హామీలు, మధ్యవర్తిత్వాలకు పోవద్దు. పిల్లల వల్ల ఖర్చులు ఉంటాయి. ఇబ్బందులుండినా ధైర్యంగానే ఉంటారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అవసరాలకు డబ్బు సమకూర్చుకొంటారు. వృత్తి వ్యాపారాలలో కొత్త విస్తరణ, ప్రయత్నాలు జరగక పోయినా, ఆదాయం లోపం కలుగదు. ఉద్యోగ నిర్వహణలో సమర్ధులుగా గుర్తింపు ఉంటుంది. కొత్త పదవులు, పరిచయాలు పెరుగుతాయి. బంధువర్గం నుండి అనారోగ్య విషయవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత, దూరప్రయాణాలుంటాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి జీవనం కలవారికి మంచి అవకాశాలు దొరకడం, వ్యాపారవర్గాలకు ఆదాయం బాగుండుట, పారిశ్రామికవేత్తలకు మౌలిక సదుపాయాలు పొందడం జరుగుతుంది. అనుకున్న పనులు నిదానంగా, సవ్యంగానే జరుగుతాయి. ఉద్యోగులకు అధికారుల నుండి సహకారం బాగుంటుంది. బిడ్డల అనారోగ్య బాధలు, ఉన్నత విద్యపై అనిశ్చితి ఉంటుంది.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వ్యాపారాలు లాభసాటిగా జరుగుతాయి. కొత్త పెట్టుబడులకు కొత్త వ్యాపారాలకు అవకాశాలుంటాయి. ఆస్థి క్రయవిక్రయాలు మరియు వ్యాపారాల అగ్రిమెంట్లు జరుగుతాయి. రావలసిన డబ్బు చేతికి కొంత అందుతుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. విలువైన వస్తువులు సమకూర్చుకొనడం, శుభకార్యములను నిర్వహించడం, దూరప్రయాణాలుండగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థికావకాశాలు కలిసివస్తాయి. అయితే కొంత డబ్బు ఖర్చు పెట్టవలసి వస్తుంది. బిడ్డల విద్యా ఉద్యోగ విషయాలలో అనుకూలత, శుభకార్యాలు నిర్ణయం కావడం, ఇంట బయట వ్యవహారాలలో చర్చలు జరపడం ఉంటుంది. వృత్తి వ్యాపార రంగాలు అభివృద్ధి కరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. విలువైన వస్తువులు సమకూరుతాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులు సవ్యంగా జరిగిపోతాయి. ఆర్థికముగా బలపడి వృత్తి వ్యాపారాలు అభివృద్ధి చెంది ఆదాయం పెరుగుతుంది. తొందరపాటు ప్రవర్తన, మాటలు అదుపులో పెట్టుకొనాలి. బిడ్డలకు స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. బంధుమిత్రులను, ప్రముఖులను కలుసుకొంటారు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది.

# బాబు ఇంట బొమ్మరిల్లు సినిమా!

శ్రీను గల్పిక

అది ప్రపంచంలోని మేటి నగరాలన్నింటిని కాసి వడబోసి కట్టిన అమరావతి రాజధాని నగరం. నారా లోకేష్ పంచాయితీరాజ్, ఐ.టి శాఖ మంత్రిగా తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. అనంతరం అక్కడే వున్న విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని పంచాయితీలకు కొత్త భవనాలు కట్టించి పంచాయితీరాజ్ మంత్రిగా సత్తా చూపిస్తాను... అట్లాగే రాష్ట్రంలో ప్రజలందరి చేత అఖరకు అడుక్కునేవాళ్ళ చేత కూడా ఆదాయపన్ను కట్టించి రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పెంచుతానని చెప్పాడు. అప్పుడు 'ఆత్మసాక్షి' రిపోర్టర్ వుండి... సార్, పంచాయితీ రాజ్ మంత్రిగా పంచాయితీలకు కొత్త బిల్డింగ్‌లు కట్టిస్తామన్నారు సరే, ఆదాయ పన్నుకు మీకు సంబంధమేంటని అడిగాడు. వెంటనే లోకేష్... ఐటి శాఖ అంటే ఇన్‌కంటాక్స్ శాఖే కదా అని సమాధానమిచ్చాడు. ఆ జవాబుకు అక్కడున్న వారందరి కళ్లు బైర్లుకమ్మాయి. వెంటనే ఏబిసిడి రిపోర్టర్ వుండి... సార్, ఐటి అంటే ఆదాయపన్నుశాఖ కాదు, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ అని అర్థం అని చెప్పాడు. లోకేష్ సెల్ తీసి తన తండ్రి చంద్రబాబుకు ఫోన్ చేసాడు. అవతల చంద్రబాబు ఫోన్ ఎత్తగానే... నాన్నారు ఐ.టి శాఖ అంటే ఏంటి అని అడిగాడు. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అని చంద్రబాబు చెప్పాడు. ఆ ముక్క నాకు మంత్రి పదవి ఇచ్చేముందు చెప్పాలి, మీరు ఐటి శాఖ ఇచ్చారంటే ఇన్‌కంటాక్స్ శాఖ ఇచ్చారనుకున్నా, దాని గురించే మీడియా ముందు మాట్లాడి ఫూల్‌నయ్యా, పోండి నాన్నగారు, మీరెప్పుడూ ఇలానే చేస్తారు అని లోకేష్ విసురుగా ఫోన్‌పెట్టేసాడు. మీడియా వాళ్ళు వెళ్లిపోయాక లోకేష్ పి.ఎస్ కొన్ని ఫైళ్లను తీసుకుని లోపలకు వచ్చాడు. పెద్ద ఫైళ్ల కట్టే ఉండడంతో లోకేష్ వాటిని చూసి... నాకిప్పుడు మూడేం బాగాలేదు, వాటిని అక్కడపెట్టండి, మూడ్ వచ్చాక అన్ని ఫైళ్లను చదివి సంతకం పెడతానన్నాడు. అందుకు పి.ఎస్... మీరేం వాటిని అంత కష్టపడి చదవబల్లేదు సార్, నాన్నగారే అన్నీ చదివి పంపించారు. జస్ట్ మీరు వాటి మీద సంతకాలు పెడితే చాలు అని చెప్పాడు. ఆ మాటకు లోకేష్ విసురుగా ఇక్కడ కూర్చుని ఇక నేనేం చేయాలి అని అడిగాడు. గంటకొకసారి బూస్ట్, లంచ్‌కు రెండు పుల్కాలు ఇవ్వమన్నారు సార్. మీరు బూస్ట్ తాగి ఆ రెండు పుల్కాలు తింటే చాలని చెప్పాడు పి.ఎస్. ఆ మాటతో లోకేష్‌కు చిర్రెత్తుకొచ్చింది. షిట్... అంటూ కాలితో ఫ్లోర్‌ను గట్టిగా తన్నాడు. ఆ దెబ్బకు ఆ ఛాంబర్‌లో ఎంతో నాణ్యతగా వేసిన రెండు టైల్స్ పగిలిపోయాయి.

★★★★★

విజయవాడలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం. ఆరోజు హైటెక్‌రత్న, నవ్యాంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు జరుగుతున్నాయి. అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రులందరూ చంద్రబాబును వీరుడు, ధీరుడు, కత్తిపట్టని విక్రమార్కుడు అంటూ తెగ పొగిడారు. అందరూ మాట్లాడాక లోకేష్ వంతు వచ్చింది. ఆయన లేచి మైక్ వద్దకు పోగానే పి.ఎస్ ఒక పేపర్ తెచ్చిచ్చాడు. ఏమిటిదని లోకేష్ అడిగాడు. స్క్రిప్ట్ సార్, నాన్నగారు రాసిచ్చారు అని పి.ఎస్ చెప్పాడు. అందుకు లోకేష్ సీరియస్‌గా... మేమూ చదువుకున్నామండి, మేమూ సొంతంగా మాట్లాడగలం. మా స్క్రిప్ట్‌లు మాకుంటాయి. చెప్పండి మీ సీఎం గారికి అని అన్నాడు. అందుకు పి.ఎస్, బికాంలో ఫిజిక్స్ చదివిన జలీల్‌ఖాన్ గారిని మీరు ఫాలో అవుతున్నారని నాన్నగారు భయపడుతున్నారు. మొన్న అంబేద్కర్ జయంతి నాడు అందరికీ వర్ధంతి శుభాకాంక్షలు చెప్పారు. ఇక్కడ కూడా అది రిపీట్ అవుతుందేమోనని నాన్నగారి భయం అని చెప్పాడు. నేను అంత శుద్ధ పప్పును కాను... మొన్నంటే తెలియక నోరు జారాను... ఇప్పుడు నాకు బాగా తెలిసింది. బర్త్‌డేను జయంతి, డెత్‌డేను వర్ధంతి అంటారు అని లోకేష్ చెప్పాడు. దానికి పి.ఎస్... మీరక్కడే పప్పులో కాలేస్తున్నారు, చనిపోయినవ్యక్తుల విషయంలోనే బర్త్‌డేను జయంతి, డెత్‌డేను వర్ధంతి అంటారు. ఇప్పుడు జీవించివున్న మనుషుల విషయంలో అయితే బర్త్‌డేను జన్మదినోత్సవం అంటారు. ఎందుకొచ్చిన రిస్క్ సార్, మళ్ళీ ఆ సోషల్ మీడియా వాళ్లకు పని పెట్టడమెందుకు, శుభ్రంగా నాన్నగారిచ్చిన స్క్రిప్ట్ చదివేసేయండి సార్ అని చేతిలో పెట్టాడు. లోకేష్ ఆ స్క్రిప్ట్ చదివేసి మౌనంగా దిగిపోయాడు. లోకేష్‌ను చూసి అక్కడున్న మంత్రులు, నాయకులు కూడా తండ్రి చాటు బిడ్డ, ఇప్పటికీ అన్నీ తండ్రి చెబితేనే చేస్తుంటాడని అనుకోసాగారు. ఆ మాటలు లోకేష్ చెవిన పడ్డాయి.

★★★★★

అది చంద్రబాబు ఇల్లు. లోకేష్, నారా బ్రాహ్మిణితో క్యారమ్స్ ఆడుతుంటే భువనేశ్వరీదేవి దేవాన్ష్‌ను ఒడిలో కూర్చోబెట్టుకుని వారి ఆటను చూస్తుంది. లోకేష్ అప్పటికి నాలుగు వైట్, ఐదు బ్లాక్ కాయిన్స్ వేసి అప్పుడే రెడ్‌కాయిన్‌ను కూడా వేసాడు. ఫాలో కాయిన్ వేస్తే రెడ్ కాయిన్ సొంతమవుతుంది. లోకేష్ ఒక వైట్ కాయిన్‌కు స్ట్రైగర్‌కు గురిపెట్టి కొట్టబోతుండగా చంద్రబాబు వచ్చాడు. తక్కున లోకేష్ చేయి పట్టుకుని ఆ కాయిన్‌ను ఇలా కొడితే ఎలా పడుద్దనుకున్నావ్... గురి చూసి రిఫ్‌లో ఈ బ్లాక్ కాయిన్‌ను కొట్టు అని చెప్పాడు. లోకేష్ ఇక కాదనలేక అలాగే చేసాడు. బ్లాక్ కాయిన్ పడలేదు గాని స్ట్రైగర్ పోయి బొక్కలో పడింది. లోకేష్ ఇంకో ఎగస్ట్రా కాయిన్ పెట్టాల్సి వచ్చింది. బ్రాహ్మణి తర్వాత మళ్ళీ స్ట్రైగర్ లోకేష్‌కు వచ్చింది. లోకేష్ రెడ్‌కాయిన్‌కు స్ట్రైగర్‌ను గురిపెట్టి కొట్టబోతుండగా, చంద్రబాబు... రేయ్, లోకేష్ అలా కొడితే ఎలా పడుతుందనుకున్నావ్, ఇటు డైరక్షన్ మార్చు అని చెప్పాడు. అపండి నాన్నగారు అంటూ లోకేష్ పెద్దగా అరిచాడు. ఏమైందిరా అని చంద్రబాబు ఆతృతగా అడిగాడు. ఆ పరిణామానికి భువనేశ్వరి కూడా నిర్ఘాంతపోయింది. లోకేష్ వుండి... ఇంతకంటే ఏం కావాలి నాన్నగారు, అందరూ నన్ను చూసి నవ్వుతున్నారు నాన్నగారు, నా పని కూడా మీరే చేస్తుంటే ఇక నా పని నేనెప్పుడు చేసుకోవాలని నాన్నగారు... మంత్రిని చేసారు, కాని ఫైల్స్ మీరే చూస్తారు, స్టేజీల మీదకు పంపిస్తారు, స్క్రిప్ట్ మాత్రం మీరే ఇస్తారు. ఇక నా స్క్రిప్ట్ నేనెప్పుడు చదవాలి నాన్నగారు. మిమ్మల్ని గెలిపించడం కోసం ప్రతి క్షణం నేను ఓడిపోతున్నాను నాన్నగారు. నాకు కావాల్సిన డ్రాయర్లు మీరే కొంటారు, నాకు హార్లిక్స్ ఇష్టమైతే మీరు బూస్ట్ ఇస్తారు, నాకు చపాతీలు తినాలనిపిస్తే మీరు పుల్కాలు పెట్టిస్తారు. నాకు ఏరోబిక్స్ ఇష్టం... మీరేమో యోగా చేయిస్తారు. ఆఖరకు నేను అంతంత మాత్రంగా ఆడే క్యారమ్స్‌లో కూడా వేలుపెట్టి ఆ ఆటలో కూడా నన్ను చేతగాని వాడిగా చేస్తున్నారు. అందరూ నవ్వుతున్నారు నాన్నగారు. ఆ సోషల్ మీడియాలో అయితే నన్ను శుద్ధపప్పు అంటూ పోస్టింగ్‌లు పెడుతున్నారు అని బాధగా అన్నాడు. అందుకు చంద్రబాబు... వాళ్ళు పోస్టింగ్‌లు పెడితే నాదా తప్పు... నేనేం చేసానురా అని అడిగాడు. అంతా మీరే చేసారు నాన్నగారు... చేయాల్సిందంతా మీరే చేసారు... అని లోకేష్ అన్నాడు. ఆ మాటకు చంద్రబాబుతో పాటు భువనేశ్వరిదేవి, బ్రాహ్మిణి, దేవాన్ష్‌లు కూడా నిర్ఘాంత పోయారు. అవేం మాటలు లోకేష్... నాన్నగారు ఏం చేసారని భువనేశ్వరీదేవి అడిగింది. అందుకు లోకేష్... అంతా నాన్నగారే చేసారమ్మా... ఈ రాష్ట్రానికి సెల్‌ఫోన్‌లు ఆయనే తెచ్చారు, ఐ.టి కంపెనీలను ఆయనే తీసుకొచ్చారు, అందరి చేతుల్లోనూ స్మార్ట్‌ఫోన్‌లు ఉండేలా చేసారు. అందరూ వాట్సాప్, ఫేస్‌బుక్‌లు వాడేలా డెవలప్ చేసారు. ఆయన తెచ్చిన ఫోన్‌లు, ఆయన తెచ్చిన సాఫ్ట్‌వేర్‌ల మూలంగానే ఈ రోజు సోషల్ మీడియా డెవలప్ అయ్యి అందులో అందరూ నన్ను 'పప్పు' అని ఆడుకుంటున్నారమ్మా... ఆయన అసలు సెల్‌ఫోన్లే తేకుంటే నాకీ పరిస్థితి ఉండేది కాదుకదా అని ప్రశ్నించాడు. ఆ మాటకు భువనేశ్వరీదేవి... నిజమే కదా అన్నట్లు చంద్రబాబు వైపు చూసింది. లోకేష్ లాజిక్‌కు ఏం చెప్పాలో తెలియక చంద్రబాబు పైన తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్‌కేసి చూడసాగాడు.

# కావలి టిడిపి అధ్యక్షునిగా అమరా!



కావలి పట్టణంలోని బృందావనం హౌసింగ్ కాలనీ కల్యాణమండపంలో ఆదివారం టిడిపి సంస్థాగత ఎన్నికలు జరిగాయి. కావలి పట్టణ అధ్యక్షునిగా అమరా వేదగిరి గుప్తా ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా జ్యోతి బాబురావు ఎంపిక కాగా, టిడిపి రూరల్ మండల అధ్యక్షునిగా తాళ్ళపాళెంకు చెందిన కోసూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా అన్నగారిపాళెంకు చెందిన పులి శివ, రుద్రకోటకు చెందిన వెంకట్రామిరెడ్డిలు ఎంపిక కాగా, ప్రధాన కార్యదర్శిగా పెదపట్టపుపాళెంకు చెందిన ప్రళయకావేరి భాస్కర్ ఎంపికయ్యారు. మండల తెలుగుయువత అధ్యక్షునిగా చలంచర్లకు చెందిన గుర్రం సునీల్ ఎంపిక కాగా, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షునిగా తాళ్ళపాళెంకు చెందిన కమతం ప్రసాద్ ఎంపికయ్యారు. వీరందరినీ మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర సన్మానించి అభినందించారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.



## కావలి కబుర్లు

### అన్ని దానాలకన్నా..

# రక్తదానమే మిన్న



అన్ని దానాలకన్నా రక్తదానమే మిన్న అని, రక్తదానం ద్వారా రోగులకు ప్రాణదానం చేసినట్లేనని కావలి టూటౌన్ ఎస్‌ఐ షేక్ జిలానీబాషా అన్నారు. ఈనెల 22న కావలి బ్లడ్‌బ్యాంక్‌లో ట్రూ హెల్పర్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ, ఆపదల్లో వున్నవారిని ఆదుకోవడంలో ట్రూ హెల్పర్స్ వారు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. యువత వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ ఛైర్మెన్ రవిప్రకాష్, జిల్లా రెడ్‌క్రాస్ కార్యవర్గసభ్యుడు గంధం ప్రసన్నాంజనేయులు తదితరులు పాల్గొని ట్రూ హెల్పర్స్ వారు చేస్తున్న సేవలను అభినందించారు. సంస్థ అధ్యక్షుడు దినేష్, రక్తనిధి సిబ్బంది, రెడ్‌క్రాస్ సభ్యులు పార్వతీశంకర్ పాల్గొన్నారు.

## దోమలను నివారించండి




ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా 'దోమలను నివారించాలి – మలేరియాను అరికట్టాలంటూ'.. కావలి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఛైర్మెన్ గుత్తి కొండ కిషోర్‌బాబు ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ ర్యాలీ నిర్వహించారు.

### శ్రీ రామదూతస్వామివారి ఆశీస్సులతో ఈ నెల 30న...

# శ్రీ వేణుదత్త సువర్ణలక్ష్మీ దాంపత్య వ్రత మహాయాగం



భగవాన్ శ్రీ రామదూత స్వామివారి ఆశీస్సులతో ఈనెల 30వతేది సాయంత్రం 6.05 గంటల నుంచి నెల్లూరులోని కస్తూరిదేవి స్కూల్‌లో శ్రీ వేణుదత్త సువర్ణలక్ష్మీ దాంపత్య వ్రత మహాయాగం జరుగుతుందని నిర్వాహకులు, ఆహ్వానకమిటీ ప్రతినిధులు ఎస్‌విఆర్ ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ సన్నపురెడ్డి విజయకుమార్‌రెడ్డి, ఇందూరు వెంకటరమణారెడ్డి (ఆత్మకూరు), యేలూరు శ్రీనివాసులురెడ్డి, తోట మనోహర్, గాదంశెట్టి గోపాల్, పాదర్తి బాలాజీ తెలియజేశారు. ఎంతో పవిత్రము, పుణ్యప్రదము, మహిమాన్వితమూ అయిన ఈ వ్రత మహాయాగంలో పాల్గొన్నవారికి సకల శుభాలు కలుగుతాయన్నారు. దివ్యశక్తి సంపన్నులైన యోగీశ్వరేశ్వరులు, దత్తావధూత అయిన శ్రీ పరమహంస పరివ్రాజకాచార్య భగవాన్ శ్రీ రామదూత స్వామి దర్శనం సకల శుభప్రదమని వారు పేర్కొన్నారు. సాక్షాత్తూ భగవత్ స్వరూపులైన శ్రీ రామదూతస్వామివారి కృపతో, ఆ స్వామి ఆశీస్సులతో జరిగే ఈ వ్రత మహాయాగంలో అందరూ పాల్గొని ఆ స్వామి కృపాకటాక్షాలను పొందగలరని వారు విజ్ఞప్తి చేశారు.



# గొలగమూడి ఆశ్రమ ఇ.ఓ పదవీకాలం పొడిగింపు

నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని గొలగమూడిలో వున్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమ కార్యనిర్వహణాధికారిగా పనిచేస్తున్న పి.బాలసుబ్రహ్మణ్యంను మరో అయిదేళ్లపాటు ఆశ్రమ ఇ.ఓగా బాధ్యతలు నిర్వహించేలా పదవీకాలం పొడిగిస్తూ హైకోర్టు తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. తొలుత బాలసుబ్రహ్మణ్యంను ఈ ఆశ్రమానికి అఫిషియల్ రిసీవర్‌గా 2006 ఆగస్టు 14న హైకోర్టు నియమించింది. ఆ తదుపరి ఆశ్రమ ఇ.ఓగా ఆయనను నియమించింది. ఇటీవల ఆయన పదవీకాలం ముగియడంతో, ఆశ్రమానికి ఇ.ఓ బాలసుబ్రహ్మణ్యం చేస్తున్న సేవలను హైకోర్టు గుర్తించి మళ్ళీ అయిదేళ్ళపాటు ఆయన పదవీకాలాన్ని పొడిగించింది. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న ఆశ్రమ కమిటీని, ఇ.ఓను అయిదేళ్లపాటు కొనసాగిస్తూ హైకోర్టు ఆ మేరకు పదవీకాలం పొడిగించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా ఇ.ఓ పి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, హైకోర్టు ఉత్తర్వులమేరకు తాము ఈ ఆశ్రమ బాధ్యతలు నిర్వహిస్తున్నామని, రానున్న రోజుల్లో ఆశ్రమాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామన్నారు.

## శ్రీకాళహస్తి న్యూస్

### ఏర్పేడు దుర్ఘటనకు...

# పరోక్ష కారకులెవరు?

### - సర్వత్రా చర్చనీయాంశంగా వున్న ఘటన



*చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలంలో ఇటీవల సంభవించిన ఘటన ఎంతో దురదృష్టకరమైనది. హఠాత్తుగా లారీ దూసుకువచ్చి అనేకమంది ప్రాణాలను హరించిన ఈ దుర్ఘటన ఎంతైనా ఘోరం..దారుణం. అయితే, ఈ ఘటన వెనుక ఇతరత్రా కారణాలు కూడా ఏమైనా వున్నాయా అన్నది చర్చనీయాంశంగా వుంది. ఈ ఘటనలో 15 మంది మృతిచెందడం, మరో 25 మంది తీవ్ర గాయాలపాలు కావడం ఎంతైనా దారుణం.*

ఈ దుర్ఘటనకు మూలకారకుడు సంబంధిత లారీ డ్రైవరే అయినప్పటికీ, పరోక్షంగా అందుకు బాధ్యులు ఎవరన్నది కూడా చర్చనీయాంశంగా వుంది. మరో కోణంలో ఈ ఘటన వెనుక విషయాలపై ప్రజల్లో చర్చగా వుంది. ఈ దుర్ఘటన నేపథ్యంలో.. ఎక్కడ చూసినా అక్రమరవాణాపైనే ప్రజలు చర్చించుకుంటున్నారు. అందువల్ల జరిగే దుష్పరిణామాలను తెలియజెప్పేందుకే రైతులు ఏర్పేడుకు వెళ్ళారు. గత రెండేళ్ళుగా స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ రవాణా జోరుగానే సాగుతోందని, ఈ అక్రమరవాణా ద్వారా అధికారపార్టీ నాయకులు కోట్లాదిరూపాయలు ఆర్జిసున్నారని, ఇసుకను అక్రమ రవాణాదారులు అలా ఇష్టంవచ్చిన రీతిలో ఇసుకను తోడివేస్తుండడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయనే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చేందుకు అనేక మంది రైతులు మునగలపాళెం గ్రామం నుంచి ఏర్పేడుకు వచ్చారు. వాస్తవానికి వారు వెంకటగిరిరోడ్డులో వున్న తహశీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అయితే, అప్పటికే జిల్లా ఎస్పీ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వున్నందున రైతులను అధికారులు రోడ్డుపైనే నిలబెట్టారు. వారిని అప్పుడే సమాధానపరిచి పంపించివేసివుంటే బహుశా ఈ దుర్ఘటనలో ఇంతనష్టం జరిగివుండేది కాదేమోనన్న అభిప్రాయాలు కూడా వినవస్తున్నాయి. స్టేషన్ ఆవరణలోకి రైతులను పోలీసు అధికారులు అనుమతించకపోవడంతో రైతులు రోడ్డుపైనే నిలబడాల్సివచ్చిందనీ, ఈలోగా లారీ దూసుకొచ్చి అనేకమంది రైతులను పొట్టనపెట్టుకుందనీ గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

ఇదిలావుంటే, మరో కోణంలో.. అధికారపార్టీ నేతలు ఇసుకను, ఎర్రచందనాన్ని కూడా ఈ ప్రాంతాల నుంచి భారీగానే తరలిస్తున్నారనే సమాచారం ప్రభుత్వ నిఘా వ్యవస్థకు తెలియదా?.. జిల్లా నుంచి రాజధానికి వెళ్ళి స్వయంగా సిఎంకు సమాచారం అందజేసే నిఘావ్యవస్థ కూడా వున్నప్పటికీ ఇక్కడేమి జరుగుతోందో తెలిసి కూడా ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వుండడం ఏమిటన్నదే ప్రజలను కలవరపెడుతున్న అంశం. ఇటీవల అబ్బాభట్లపల్లె, శేషమనాయుడు కండ్రిగ గ్రామాల్లో ఎర్రచందనం పట్టుబడింది. ఈ రెండు సంఘటనల్లో అధికారపార్టీ నాయకుల హస్తం వున్నా, అనామకులపై కేసులుపెట్టి చేతులు దులుపుకున్నారనే విమర్శలున్నాయి. ప్రధానంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంతోపాటు, జిల్లా తూర్పు ప్రాంతంలో గతకొంతకాలంగా తిష్టవేసిన పోలీసు అధికారులు ఎర్రచందనం, ఇసుక, మట్టి ఇతర ప్రాంతాలకు తరలి వెళ్ళడంలో సహకరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇలా స్వర్ణముఖి నుంచి చెన్నైకి, బెంగుళూరుకి ఇసుకను తరలించి అధికారపార్టీనాయకులు కోట్లాదిరూపాయలు ఆర్జిస్తున్నా పట్టించుకునేవారెవరూ లేరని గ్రామాల్లో గగ్గోలుగా వుంది. సొంతజిల్లా అయిన చిత్తూరులో ఏమి జరుగుతుందో ముఖ్యమంత్రికి తెలియకపోవడం ఏమిటన్నది అందరికీ ఆశ్చర్యంగానే వుంది. రామసముద్రం మండలంలో కానీ, కర్నాటక సరిహద్దుల్లోని పశ్చిమజిల్లా ప్రాంతం నుంచి కానీ రోజూ వేలాది ట్రక్కుల ఇసుక కర్నాటక రాష్ట్రానికి తరలిపోతుంటే, సత్యవేడు నియోజకవర్గం నుంచి గ్రావెల్, ఒకరకమైన మట్టి తమిళనాడుకు తరలిపోతుంటే ఎవరూ పట్టించుకోకపోవడం ఏమిటని ప్రజల్లో చర్చనీయాంశంగా వుంది.

అంతేకాదు, ఏర్పేడు మండలంలోని గ్రామాలకు చెందిన పాత రెవెన్యూ రికార్డులన్నీ రెవెన్యూ కార్యాలయాల్లో లేవని, వాటిలో అధికభాగం తెలుగుదేశంపార్టీ నాయకుల ఇళ్ళల్లోనే వున్నాయనే ఆరోపణలూ వున్నాయి. అందువల్లనే మండలంలో విస్తరించబడిన ఎయిర్‌పోర్ట్, ఇతరత్రా కంపెనీలకు సంబంధించిన భూసేకరణలో రకరకాల అవకతవకలు జరిగేందుకు కూడా అవకాశం ఏర్పడిందనే భావన ప్రజల్లో వుంది.

ఏదేమైనా, ప్రభుత్వం ఈ వ్యవహారాలన్నిటినీ సమగ్రంగా విచారించి నిజానిజాలను వెలికితీయాల్సివుందని, భారీగా తరలిపోతున్న ఎర్రచందనం, ఇసుక అక్రమరవాణాలకు వెంటనే అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా వుందని ప్రజలు కోరుకుంటున్నారు.



# 'మే'లో రాకెట్ల ధమాకా!

అంతరిక్ష ప్రయోగాలలో అడ్డు అదుపు లేకుండా దూసుకుపోతున్న ఇస్రో 'మే' నెలలో షార్ వేదికగా రాకెట్ల పండుగ జరుపబోతుంది. ఆ ఒక్క నెలలోనే మూడు రాకెట్ ప్రయోగాలకు సన్నాహాలు చేస్తోంది. ఈమేరకు ఇస్రో ఛైర్మెన్ కిరణ్‌కుమార్ 23వ తేదీ షార్‌ను సందర్శించి నిర్మాణంలో వున్న రాకెట్లను పరిశీలించారు. మే 5వ తేదీన జిఎస్ఎల్‌వి-ఎఫ్09ను ప్రయోగించడానికి సన్నద్ధమవుతున్నారు. దీనికి సంబంధించిన పనులు రెండో లాంచ్‌ప్యాడ్‌కు సమీపంలోని వ్యాబ్‌లో జరుగుతున్నాయి. ఈ రాకెట్ ద్వారా 2.2టన్నుల బరువుగల సార్క్ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెడతారు. అలాగే పిఎస్ఎల్‌వి-సి38 రాకెట్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. మొదటి లాంచ్‌ప్యాడ్‌లో దీని పనులు చేస్తున్నారు. మే 25వ తేదీన ఈ రాకెట్‌ను ప్రయోగించే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పిఎస్ఎల్‌వి-సి38 ద్వారా మన దేశానికి చెందిన కార్టోశాట్-2ఇ ఉపగ్రహంతో పాటు విదేశాలకు చెందిన 37ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపనున్నారు. ఇది కాగానే మే30వ తేదీన అత్యంత ప్రతిష్టాత్మకమైన జిఎస్ఎల్‌వి-మార్క్3డి1 రాకెట్‌ను ప్రయోగించాలని చూస్తున్నారు. దీని ద్వారా 3200 కిలోల బరువుగల జి-శాట్ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెడతారు. ఈ రాకెట్ ప్రయోగం విజయవంతమైతే ఇస్రో చరిత్రలో అదో పెద్ద మలుపు అవుతుంది. అత్యంత బరువుగల ఉపగ్రహాలను కూడా కక్ష్యలోకి పంపే సాంకేతిక పరిజ్ఞానం మన సొంతమవుతుంది. ఇప్పటివరకు అధిక బరువున్న ఉపగ్రహాల ప్రయోగాలకు మనం ఫ్రెంచ్‌గయానా, నాసాల మీద ఆధారపడుతూ వచ్చాం. ఇది విజయవంతమైతే అధికబరువు ఉపగ్రహాలకు మనం పెడుతున్న దాదాపు 400కోట్ల ఖర్చు తగ్గుతుంది. అంతే కాదు, అధికబరువుగల ఉపగ్రహాల ప్రయోగానికి విదేశాల నుండి కూడా ఆర్డర్‌లు పొందవచ్చు. 4500 నుండి 5000 కిలోల బరువుగల ఇన్సాట్-4 ఉపగ్రహాలను మనం కక్ష్యలోకి పంపగలం. ప్రస్తుతం అమెరికా, రష్యా, చైనాలకు మాత్రమే ఈ సామర్థ్యం వుంది. జిఎస్ఎల్‌వి-మార్క్3డి1 విజయవంతమైతే ఆ దేశాల సరసన భారత్ నిలుస్తుంది.



### అపూర్వం.. అద్వితీయం

# తిక్కన సాహితీ వైభవం

**· ప్రముఖ సాహితీవేత్త మోపూరు వేణుగోపాలయ్య**

తెలుగు సాహిత్యానికి, తెలుగు భాషకు మహాకవి తిక్కన చేసిన సేవలు అపూర్వము.. అమోఘమైనవని, తిక్కన రచించిన మహాభారతం చదివితే మొత్తం తెలుగు సాహిత్యాన్నే అధ్యయనం చేసినంత ఫలితం దక్కుతుందని ప్రముఖ సాహితీవేత్త, విఆర్ కళాశాల విశ్రాంత ఆంధ్రశాఖ ఆచార్యులు మోపూరు వేణుగోపాలయ్య అన్నారు. ఈ నెల 21న నెల్లూరు వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో స్థానిక టౌన్‌హాలు ప్రాంగణంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి (జూనియర్) స్మారకభవనంలో జరిగిన తిక్కన సాహిత్యసభలో ఆయన ప్రసంగించి తిక్కన రచనా వైభవాన్ని వివరించారు. కవిబ్రహ్మ తిక్కన రచనాశైలి అద్వితీయమైనదని, అసామాన్యమైనదని అంటూ, మహాకవి తిక్కన రచించిన మహాభారతం చదివితే ఆ వ్యక్తి పరిపూర్ణ సాహితీవేత్త కాగలడని అభివర్ణించారు. మహాభారతంలోని ప్రతి పర్వాన్ని తిక్కన తనదైన అత్యద్భుతమైన శైలితో రచించి తెలుగు కవితామతల్లికి కంఠాభరణంగా సమర్పించారని ఆయన అన్నారు. మహాభారతంలోని ఉద్యోగపర్వం గురించి వేణుగోపాలయ్య ప్రస్తావిస్తూ, సాహిత్యం కేవలం పండితులకే కాదు సామాన్య ప్రజలకు కూడా చేరువకావాలనే ధ్యేయంతో నాటి కాలంలోనే అనితరసాధ్యమైన కృషిచేసిన తొలి అభ్యుదయకవి తిక్కన అని ప్రశంసించారు. అందుకే తిక్కన మహాకవి ప్రజలకు బాగా అర్థమయ్యేవిధంగా సరళసుందరమైన భాషతో, ఎంతో పాత్రోచితంగా ఉద్యోగ పర్వాన్ని.. మొత్తంగా మహాభారతాన్ని అద్వితీయంగా రచించి శాశ్వతకీర్తిని సముపార్జించుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వర్ధమానసమాజం అధ్యక్ష కార్యదర్శులు వంటేరు వెంకటకృష్ణారెడ్డి, మజ్జిగ ప్రభాకరరెడ్డిలతో పాటు ప్రముఖ రంగస్థల నటులు, రాష్ట్ర ప్రభుత్వ 'హంస' అవార్డు గ్రహీత పొన్నాల రామసుబ్బారెడ్డి, ప్రముఖ సాహితీవేత్త మెట్టు రామచంద్రప్రసాద్, ప్రముఖ రంగస్థలనటులు వల్లకవి వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం, నిర్వాహకులు తిక్కన సాహితీవైభవం గురించి అద్భుతంగా ప్రసంగించిన మోపూరు వేణుగోపాలయ్యను ఘనంగా సత్కరించారు.

# యుఎన్ఆర్‌లో గ్రాడ్యుయేషన్ డే



నెల్లూరు నవాబుపేట రామచంద్రాపురంలోని యుఎన్ఆర్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో ఈ నెల 25వ తేదీ గ్రాడ్యుయేషన్ డే, కల్చరల్ ఫెస్ట్ ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, జడ్.శివప్రసాద్, ఎస్ఎస్‌వి నాయుడు, యాలమూరి రంగయ్య నాయుడు, ఏలూరి సంజీవనాయుడు, పత్తి మల్లిఖార్జున్, బాలాజీ, వై.వెంకటరామయ్య, మాజీ ఎంఇఓ నరసయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పేద మధ్య తరగతి విద్యార్థులకు మంచి విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారని, తల్లి తరువాత స్థానం గురువులదేనని, సంస్కృతి, సంప్రదాయాలను గురించి స్కూలు కరస్పాండెంట్ యు.నరసారెడ్డి తమ విద్యార్థులకు తెలిసేటట్లు వివిధ పండుగలను స్కూలులో నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం చదువులో ప్రతిభ కనుపరచిన విద్యార్థులకు మెడల్స్ బహుకరించారు.

# లక్ష్యసాధనతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులు బాగా చదువుకోవాలని, ఒక సమున్నతమైన లక్ష్యాన్ని ఎన్నుకుని ఆ లక్ష్యసాధనకు కృషి చేస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు వుంటుందని, విద్యే సర్వస్వంగా భావించి కృషి-పట్టుదలతో మంచి చదువులు చదువుకుంటే ఎన్నో ఉన్నతశిఖరాలను అందుకోవచ్చని ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందగిరి స్వామీజీ ఉద్బోధించారు. నెల్లూరు ఏకె నగర్‌లోని రుత్విక్ ఎన్‌క్లేవ్‌లో ఏర్పేడు శ్రీ వ్యాసాశ్రమంవారిచే నడపబడుతున్న శ్రీ వేంకటేశ్వర విద్యాలయం వార్షికోత్సవానికి ఆయన విచ్చేసి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు బాల్యం నుంచే సద్గుణాలు అలవరచుకోవాలని, నైతిక విలువలు పాటించాలని, భారతీయ సంప్రదాయాలను అనుసరిస్తూ మంచి నడవడికతో ఉత్తమ పౌరులుగా భాసిల్లాలని స్వామీజీ ఆకాంక్షించారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర విద్యాలయం ప్రధానోపాధ్యాయుడు, చరిత్ర పరిశోధకుడు, ప్రముఖ బాలసాహితీవేత్త.. ఇటీవలే విజయనగరం జిల్లా పార్వతీపురంలోని మంచిపల్లి సేవాట్రస్ట్ వారిచే 'బాలసాహితీభూషణ్' అనే విశిష్టమైన అవార్డును అందుకున్న డా.గంగిశెట్టి శివకుమార్ దంపతులను స్వామీజీ ఘనంగా సన్మానించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల కరెస్పాండెంట్ శ్రీ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ముత్యాల సుందరరామ్, పూజ్యులు శ్రీ అసంగానందగిరి స్వామీజీ (వ్యాసాశ్రమ కార్యదర్శి), మాతా అనంతానందగిరిస్వామిని పాల్గొని విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి.

# ఫేస్'బుక్'అయ్యారు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు మనోభావాలకు సోషల్ మీడియానే వేదికగా నిలిచింది. సోషల్ మీడియాలో చంద్రబాబు ప్రభుత్వ అవినీతి, అక్రమాలను బయటపెట్టడం ఎక్కువైంది. ప్రభుత్వపరంగా ఏ చిన్న పొరపాటు జరిగినా వెంటనే సోషల్ మీడియాలో నెటిజన్లు తుప్పు రేపేస్తున్నారు. ముఖ్యంగా మంత్రి నారా లోకేష్‌నైతే ఆడుకుంటున్నారు. తన ఎల్లో మీడియా భజన చేస్తున్నంత కాలం చంద్రబాబుకు సమ్మగా వుండింది. సోషల్ మీడియాలో ఎప్పుడైతే వ్యతిరేక ప్రచారం ఉధృతమైందో అప్పుడు సుర్రుమంది. అదీగాక ఈమధ్య జనాలు టీవీ ఛానెల్స్‌ను ఎక్కువుగా చూడ్డం లేదు. టీవీలో చెప్పింది నమ్మడం లేదు. చేతిలో సెల్‌ఫోన్ వుంటుంది కాబట్టి ఫేస్‌బుక్‌లోనే వార్తావిశేషాలు చూసుకుంటున్నారు. రాష్ట్రంలో యువత ఎక్కువ భాగం చంద్రబాబుకు వ్యతిరేకంగానే వుంది. ప్రత్యేకహోదా, నిరుద్యోగ భృతి, ఉపాధి అంశాల విషయంలో బాబు మోసం చేయడంతో పాటు ప్రతిపక్ష నేత జగన్ పట్ల యువత ఆకర్షింపబడుతున్నారు. సోషల్ మీడియాను ఎక్కువుగా ఉపయోగించేది కూడా యువతే! కాబట్టే సోషల్ మీడియాలో తెలుగుదేశం వ్యతిరేక ప్రచారం ఎక్కువుగా ఉంటోంది. దీనిని తట్టుకోలేకే చంద్రబాబు సోషల్ మీడియాలో తనకు వ్యతిరేక ప్రచారం చేస్తున్న వ్యక్తులపై అక్రమ కేసులు పెట్టించి, అరెస్ట్ చేయిస్తున్నాడు. చంద్రబాబు బండారం ఇక్కడే బయటపడుతుంది. ప్రతిపక్షనేత జగన్ మీద, ఆయన కుటుంబం మీద పచ్చమీడియా ఎంత విషప్రచారం చేసింది. ఈ లెక్కన చూస్తే ఎంతమంది ఎల్లో మీడియా అధిపతులను అరెస్ట్ చేసి వుండాలి. సోషల్ మీడియాలో వ్యక్తులే అధిపతులు. సోషల్ మీడియాలో వ్యతిరేక ప్రచారం జరుగుతుందని అరెస్ట్‌ల జోలికి వెళితే చంద్రబాబు కొన్ని లక్షల మందిని అరెస్ట్ చేయించాల్సి వస్తుంది. అరెస్ట్‌ల వంటి వాటితో సోషల్ మీడియాను అణచాలని చూస్తే చంద్రబాబు తేనెతుట్టె మీద రాయి వేసినట్లే!

# అయోమయంలో... ఆనం బ్రదర్స్

(మొదటి పేజీ తరువాయి)

వాళ్లకు మనశ్శాంతి లేదు. పార్టీలో సరైన ప్రాధాన్యత లేదు. ఆనం రామనారాయణరెడ్డికి ఆత్మకూరు ఇన్‌ఛార్జి బాధ్యత ఇవ్వడం తప్పించి ఇంకేమీ పదవులు లేవు. ఆనం వివేకాకు ఎమ్మెల్సీ ఇస్తామన్న హామీ గాలికి కొట్టుకుపోయింది. అదంతా పక్కనపెడితే ఒకప్పుడు జిల్లాలో వీళ్లు ఏనుగులు లాగా పోతుంటే నక్కి నక్కి చూసిన ఎలుకల్లాంటి నాయకులు కూడా ఇప్పుడు వాళ్ల ముందుకు వచ్చి తోక చూపిస్తున్నారు. ఈ పరిణామాలను జీర్ణించుకోవడం వారికి కష్టమే! ఇక వాళ్ళు తెలుగుదేశంలో ఎక్కువరోజులు కొనసాగే పరిస్థితులు కనిపించడం లేదు.

# అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు

సింహపురి భవిత ద్వారా గృహ నిర్మాణ సంస్థలో 50 డేటా ఎంట్రీ ఆపరేటర్లు, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థలో 46 డేటా ఎంట్రీ ఆపరేటర్లు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్నల్ సిఇఓ డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఎస్సీ కంప్యూటర్స్, బి.కాం కంప్యూటర్స్, బీసీఏ, ఎంసిఏ, బిటెక్(సిఎస్‌సి, ఇసిఇ, ఈఈఈ) ఏదైనా డిగ్రీతో పిజిడిసిఏ విద్యార్హతలని తెలిపారు. నెల్లూరుజిల్లా వాసులై 18 నుంచి 42ఏళ్ళలోపువారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలతో దరఖాస్తు ఫారాలను పూర్తిచేసి జనన, కులధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు జెరాక్స్‌లను జతచేసి ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5గంటల లోగా సింహపురి భవిత, కేరాఫ్ సెట్నల్ కార్యాలయం, కరెంటాఫీస్ సెంటర్, ఎకె నగర్ పోస్టాఫీస్ వద్ద, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో అందజేయాలని కోరారు. వివరాలకు 9849909074 నెంబరులో సంప్రదించాలని కోరారు.

# నారా చంద్రుడు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తామంటూ ప్రకటనలిస్తున్నారు. ఎవరెన్ని ప్రకటనలు చేసినా మోడీ తనను కాదని పోడని, బీజేపీతో బంధం తెగిపోకుండా చేసేందుకు డిల్లీలో వున్న తన లాబీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని బాబుగారి నమ్మకం.




## అమ్మా ..!

మీ జ్ఞాపకాలే మాకు జీవితమయ్యాయి...
మీ ఆశయాలే మాకు శ్వాసలా మారాయి.
మీ ప్రేమాభిమానాలే మాకు ప్రాణమయ్యాయి...
మీ ఆదర్శాలే మా మార్గమయ్యాయి.
మీ చల్లని దీవెనలే మాకు నీడయ్యాయి...
మీ మంచి మాటలే మాకు తోడయ్యాయి.

భౌతికంగా మీరు మా నుండి దూరమైనా...
మా ఆశల్లో, మా ఆశయాల్లో.. మా జ్ఞాపకాలలో,
మా ఆలోచనలలో.. అనుక్షణం మీరే వున్నారు.
మా గుండెగుడులలో అమ్మవై, కామాక్షమ్మవై కొలువుదీరారు.
మీ ఆశయాలను మేం వదలం,
మా మనసుల్లో మీ జ్ఞాపకాలు పదిలం...

మా అమ్మ, అనురాగాల పూలకొమ్మ

**శ్రీమతి పందిళ్ళపల్లి అరుణమ్మ**

మమ్ము వీడి ఏడాది అయిన సందర్భంగా...

ఆ పుణ్యమూర్తి దివ్యస్మృతిని స్మరిస్తూ...

కుమారుడు - కోడలు
పందిళ్ళపల్లి హేమంత్ రెడ్డి - సింధు
మనుమరాలు - కామాక్షి హన్విత రెడ్డి

భర్త - పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి

కుమార్తె - అల్లుడు
నిరూప - చెర్లో కోటారెడ్డి

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com